PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 254 | విజయవాడ, సోమవారం 17 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 17 April 2023 | Rs

మహారాష్ట్రలో దారుణం

- అమిత్ షా సభలో వడదెబ్బకు 8 మంది మృతి
- మరో 125 మంది ఆసుపత్రి పాలు
- నీడ ఏర్పాటు చేయకపోవటమే కారణం

లోపలి పేజీలో..



కందుకూరి ఆశయాలు శిరోధార్యం

- 175వ జయంతి సభలో వక్తలు
- అలరించిన నృత్య రూపకం

లోపలి పేజీలో

వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్ట్

వివేకా హత్య కేసులో 14 రోజులు రిమాండ్ విధించిన సిబిఐ కోర్టు

ప్రజాశక్తి- యంత్రాంగం

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప వైసిపి ఎంపి తండ్రి వైఎస్.భాస్కర్‌రెడ్డిని సిబిఐ అరెస్టు చేసింది. ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటలకు పది మందితో కూడిన సిబిఐ అధికారుల బృందం రెండు వాహనాల్లో పులివెందులోని భాస్కర్‌రెడ్డి ఇంటికి వచ్చింది. కొన్ని నిమిషాలపాటు ఆయనను విచారించింది. ఆ సమయంలో ఇంట్లోకి ఎవరినీ అనుమతించలేదు. తన వ్యక్తిగత న్యాయవాదిని అనుమతించాలని భాస్కర్‌రెడ్డి కోరినా సిబిఐ అధికారులు స్పందించలేదు. ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఆయన సెల్ ఫోన్‌ను సీజ్ చేశారు. అనంతరం ఆయనను అరెస్ట్ చేసి 120 బి సెక్షన్ కింద రెడ్‌విత్, 302, 201 ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు పెట్టారు. ఈ విషయాన్ని వైఎస్ భాస్కర్‌రెడ్డి భార్య లక్ష్మి, సమీప బంధువు జనార్ధన్‌రెడ్డికి అరెస్టు మెమోలో తెలియజేశారు.

పులివెందుల నుంచి రోడ్డు మార్గంలో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి భాస్కర్‌రెడ్డిని తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. ఆ తర్వాత సిబిఐ కోర్టు న్యాయమూర్తి నివాసంలో జడ్జి ఎదుట హాజరు పర్చారు. ఆయనను విచారిస్తే వివేకానంద రెడ్డి హత్య కుట్రలో కీలక వివరాలు తెలిసే అవకాశం ఉందని, పది రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని జడ్జిని కోరారు. అరెస్టు అక్రమమని, రిమాండ్‌ను తిరస్కరించాలని భాస్కర్‌రెడ్డి తరుపు న్యాయవాదులు వాదించారు. అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, ఎక్కడా ఆగకుండా సుదీర్ఘ ప్రయాణంతో సిబిఐ అధికారులు హైదరాబాద్ తరలించారని జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి... భాస్కర్‌రెడ్డికి ఈ నెల 29 వరకు (14 రోజులు) రిమాండ్ విధించారు. చంచల్‌గూడ జైలుకు తరలించాలని ఆదేశించారు. భాస్కర్‌రెడ్డిఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు మిగతా 2లో



జడ్జి ఇంటి నుండి భాస్కర్‌రెడ్డిని జైలుకు తరలిస్తున్న దృశ్యం

కీలక అంశాలు విస్మరిస్తున్న సిబిఐ : అవినాష్ రెడ్డి

మాజీ మంత్రి వై.ఎస్.వివేకానంద హత్య కేసు దర్యాప్తులో సునీతతో సిబిఐ కుమ్మక్కు అయిందని ఎంపి వై.ఎస్.అవినాష్ రెడ్డి ఆరోపించారు. ధైర్యాన్ని కోల్పోకుండా నిజాయితీని నిరూపించుకుంటా మన్నారు. ఆదివారం తన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డి అరెస్ట్ వార్త తెలియగానే వెంటనే పులివెందులకు మధ్యాహ్నం 3.30 గంటలకు చేరుకున్నారు. పులివెందులలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. వివేకా కుమార్తె సునీత చెప్తున్న కోణంలోనే సిబిఐ దర్యాప్తు చేస్తోందని, కీలక అంశాలను విస్మరిస్తోందని ఆరోపించారు. వివేకా ఆస్తికి సంబంధించిన దస్త్రాలను, పేరు మార్పు పత్రాలను దాచి పెట్టమని ఆయన పిఎ కృష్ణారెడ్డికి వివేకా అల్లుడు రాజశేఖర్‌రెడ్డి చెప్పారని ఆరోపించారు. జమ్మలమడుగు ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న సమయంలో వివేకా బావమరిది నరేడ్డి శివ ప్రకాష్ రెడ్డి తనకు ఫోన్ చేసి వివేకా చనిపోయిన విషయం చెప్పారని తెలిపారు. తన తండ్రి భాస్కర్ రెడ్డిని ఊహించని విధంగా సిబిఐ అరెస్ట్ చేసిందన్నారు. వివేకా హత్య విషయాన్ని పోలీసులకు ముందు చెప్పింది తానేనని తెలిపారు. సమాచారం ఇస్తే తననే దోషిగా చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గాలి మాటలు, గాలి కబుర్లు చెప్పడం లేదని, సాక్షుల స్టేట్‌మెంట్ ఆధారంగానే చెప్తున్నానని అన్నారు. దస్తగిరి స్టేట్‌మెంట్లో కీలక అంశాలను సిబిఐ విస్మరించిందని విమర్శించారు. వాస్తవాల ఆధారంగా విచారణ జరపాలన్నారు. అప్రూవర్‌గా మారిన దస్తగిరి ముందస్తు బెయిల్‌కు సిబిఐ సహకరించిందని ఆరోపించారు. దస్తగిరికి బెయిల్ విషయంలో సునీత ఎందుకు అభ్యంతరం చెప్పలేదని ప్రశ్నించారు. రెండో భార్యకు ఆస్తి రాసి ఇవ్వాలని వివేకానంద రెడ్డి అనుకున్నారని, ఈ నేపథ్యంలో 2010లో షేక్ మహమ్మద్ అక్బర్‌గా పేరు మార్చుకున్నారని తెలిపారు. దీనికి సంబంధించి స్టాంప్ పేపర్ చోరీ జరిగిందన్నారు. దీనిపైనా, ఏప్రిల్ 3న సిబిఐ దృష్టికి తాను తీసుకొచ్చిన అభ్యర్థనలపైనా విచారణ ఎందుకు చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. హత్యలో పాల్గొన్న నలుగురి పేర్లనూ వాచ్‌మెన్ రంగన్న పోలీసులకు ఇప్పటికే చెప్పాడని తెలిపారు.



పులివెందులలో సిఎం క్యాంపు కార్యాలయం వద్ద అవినాష్ రెడ్డి

యుపిలో దారుణ హత్యలను ఖండించండి

- సిపిఎం పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : పోలీసు కస్టడీలో ఉన్న అతీక్ అహ్మద్, ఆయన సోదరుడు అష్రఫ్‌లను మీడియా ముందే దారుణంగా హత్య చేయడం ఉత్తర ప్రదేశ్ పూర్తిగా చట్ట రహిత రాష్ట్రంగా మారినట్టు సూచిస్తుందని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'భారీ పోలీసు బందోబస్తు మధ్య ఇద్దరు వ్యక్తులను హత్య చేసిన తీరు అధికారులు కుమ్మక్కయిన పరిస్థితిని సూచిస్తుంది. ఎన్‌కౌంటర్ హత్యలు పునరావృతమవుతుండటం న్యాయవ్యవస్థకు అతీతంగా జరుగుతున్న హత్యలే. ఈ పరిస్థితికి ఆదిత్యనాథ్ ప్రభుత్వమే ప్రత్యక్ష బాధ్యత వహించాలి. హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ఉన్నతస్థాయి విచారణ జరగాలి. ఈ హత్యల వెనుక ఉన్న వారందరినీ గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలి.' అని సిపిఎం డిమాండ్ చేసింది.




అతిక్ హంతకులకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

- భారీ బందోబస్తు మధ్య అతిక్ సోదరుల అంత్యక్రియలు
- ముగ్గురు సభ్యుల జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు

లోపలి పేజీలో..

గణితం, సైన్స్‌లోనూ పాఠాల తొలగింపు!

- ఎన్‌సిఇఆర్‌టి నిర్ణయంతో విద్యార్థులపై ప్రతికూల ప్రభావం



న్యూఢిల్లీ : ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల నుంచి చరిత్ర, రాజకీయ శాస్త్రానికి సంబంధించిన కొన్ని చాప్టర్లను తొలగించడమే కాదు... గణితం, సైన్స్ సబ్జెక్టులలోని కొన్ని కీలక అంశాలను తొలగించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ 'హేతుబద్ధీకరణ' ప్రయత్నాలు విద్యార్థుల అభ్యసనంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల విద్యకు సంబంధించిన విధానాలు, కార్యక్రమాలపై ఎన్‌సిఇఆర్‌టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలు సూచనలు చేసింది.

విద్యార్థులపై భారం తగ్గించే పేరిట, హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా చాప్టర్లను తొలగించామని కుంటిసాకులు చెప్పింది. లెక్కల సబ్జెక్టులో యూక్లిడ్ డివిజన్ లెమ్మా (రెండు సంఖ్యల గసాభాను కనుగొనడం), వెక్టర్ ఆల్‌జీబ్రా (సదిశ బీజగణితం) చాప్టర్లను, జీవశాస్త్రంలోని రీప్రొడక్టివ్ సిస్టమ్స్ (ప్రత్యుత్పత్తి వ్యవస్థ) చాప్టర్‌ను తొలగించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఈ మార్పులు అమలులోకి వస్తాయి.

ఈ చాప్టర్లను తొలగించడం వల్ల విద్యార్థులకు ఆయా సబ్జెక్టులపై ప్రాథమిక అవగాహన లోపిస్తుందని విద్యావేత్తలు, ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. జెఇఇ, నీట్, నాటా వంటి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల అవకాశాలపై కూడా ప్రభావం పడుతుంది. ఈ నిర్ణయంతో 11, 12 తరగతుల పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఉపాధ్యాయుడు పర్వేధ్ బంబా చెప్పారు. దేశంలో అనేక ప్రవేశ పరీక్షలకు సిబిఎస్ఇ సిలబస్ ప్రామాణికంగా ఉంటోంది. గత కొంతకాలంగా ఈ సిలబస్‌ను బోర్డు తగ్గించి వేస్తోంది. దీంతో ప్రవేశ పరీక్షలకు సిద్ధపడడం విద్యార్థులకు కొంచెం సులభమవుతోంది. పదో తరగతిలో సిలబస్‌లో కీలక చాప్టర్లను తొలగించడం వల్ల 11, 12 తరగతుల సిలబస్‌ను అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. పాఠ్యాంశాలను మరింత లోతుగా అధ్యయనం చేయాలనుకునే విద్యార్థులకు ఆ అవకాశం లేకుండా పోతుంది.

'సెకండరీ గ్రేడ్‌లో మొక్కలు, జంతువులకు సంబంధించిన చాప్టర్లను తొలగించడంతో పాటు ప్రాథమిక తరగతుల నుండి కూడా తీసేశారు. ఈ పాఠ్యాంశాలను గురించి విద్యార్థులు ఇక ఎలా తెలుసుకుంటారు ?' అని ఒక ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు ప్రశ్నించారు. జెఇఇ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన ముఖ్యమైన చాప్టర్లను సైతం భౌతికశాస్త్రం నుంచి తొలగించారు. ఎన్‌సిఇఆర్‌టి నిర్ణయం వల్ల మంచి కంటే చెడే ఎక్కువ జరిగిందని ఢిల్లీ ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ ఒకరు వ్యాఖ్యానించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తొలగించిన చాప్టర్లను సైతం బోధిస్తున్నారు. మరికొన్ని పాఠశాలలు విద్యార్థుల కోసం బ్రిడ్జి కోర్సులు నడుపుతున్నాయి.

మద్యం కేసు ఓ కల్పితం

తొమ్మిది గంటల విచారణ అనంతరం మీడియాతో కేజ్రీవాల్

- సిబిఐ కార్యాలయం వద్ద పంజాబ్ సిఎం బైఠాయింపు
- పలువురు ఆప్ నేతల అరెస్టు



సిబిఐ ప్రధానకార్యాలయానికి సమీపంలో బైఠాయించిన పంజాబ్ సిఎం భగవంత్ మన్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తదితరులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మద్యం కుంభకోణం కేసు పూర్తిగా కల్పితమని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. సిబిఐ అధికారులు తొమ్మిది గంటలపాటు ఆయనను సుదీర్ఘంగా విచారించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిబిఐ అధికారులు 56 ప్రశ్నలు అడిగారు. మద్యం కుంభకోణంలో ఆరోపణలన్నీ అవాస్తవాలు. ఢిల్లీ మద్యం కేసు పూర్తిగా కల్పితం. అంతా భూటకం' అని చెప్పారు. ఢిల్లీలో నూతన మద్యం విధానం అమలులోకి వచ్చిన 2020 నాటి నుంచి అన్ని వివరాలను సిబిఐ అధికారులు ప్రశ్నించినట్లు తెలిపారు. మరింత వివరంగా తాము నిర్వహించబోయే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడతానని చెప్పారు. 'ఈ మద్యం పాలసీ కేసు పూర్తిగా అవాస్తవం. నిజాయితీనే ఆప్ సిద్ధాంతం. చావనైనా చస్తాం గానీ, నిజాయితీతో రాజీపడబోం. ఢిల్లీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నంలోనే ఈ కేసును తెరమీదకి తీసుకొచ్చారు. ఆప్ జాతీయ పార్టీగా అవతరించింది. దీన్ని అడ్డుకునేందుకే ఇలా చేస్తున్నారు' అని అన్నారు.

సిబిఐ కార్యాలయంలో అధికారుల ముందు కేజ్రీవాల్ ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో హాజరయ్యారు. లిక్కర్ కుంభకోణంలో సాక్షిగా వాంగ్మూలం నమోదుకే కేజ్రీవాల్‌ను సిబిఐ ప్రశ్నించినట్లు సమాచారం. అంతకుముందు ఆయన రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీ సమాధి వద్ద ప్రార్థనలు చేశారు. అక్కడి నుంచి సిబిఐ కార్యాలయానికి వెళ్లారు. కేజ్రీవాల్‌కు మద్దతుగా సిబిఐ కార్యాలయానికి వెళ్లిన పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఢిల్లీ రాష్ట్ర మంత్రులు అతిషి, సౌరభ్ భరద్వాజ్, ఆమ్ ఆద్మీ సీనియర్ మిగతా 5లో

ఇఐఐలో ప్రభుత్వ సంస్థలను అనుమతించాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి -ఉక్కునగరం, విశాఖ



విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఇఒఐ)లో పాల్గొనేందుకు ప్రభుత్వ సంస్థలను అనుమతించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 794వ రోజుకు చేరాయి. దీక్షలో సిఐటియు కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు కెఎం.శ్రీనివాసరావు, డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, సిహెచ్ సన్యాసిరావు మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ద్వారా జెఎస్‌డబ్ల్యు, జెఎస్‌పిఎల్, వంటి స్టీల్ ప్రత్యర్థి కంపెనీలకు అవకాశం కల్పించొద్దని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తేను కోరామని తెలిపారు. ఉక్కు కార్యదర్శిని, కేంద్ర ఉక్కు శాఖా మంత్రికి కూడా విజ్ఞప్తి చేశామన్నారు. ప్రత్యర్థి కంపెనీలు వస్తే స్టీల్‌ప్లాంట్ బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా పోతుందని, మార్కెట్లో విశాఖ స్టీల్ ప్లాంట్ వాటా కూడా నష్టపోతుందని వివరించారు. ప్రయివేట్ స్టీల్ కంపెనీలకు అవకాశం కల్పించాలని యాజమాన్యం ప్రయత్నం చేస్తే ఇక్కడి కార్మిక వర్గం సహించదని యాజమాన్యానికి స్పష్టం చేసినట్లు తెలిపారు. ఇఒఐ ద్వారా ఇతర ప్రయివేటు స్టీల్ కంపెనీలు రాకుండా అడ్డుకట్ట వేయడానికి యాజమాన్యం నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశారు. సెయిల్, ఎన్‌ఎండిసి, రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ వంటి ప్రభుత్వ సంస్థలు ముందుకు వచ్చేలా కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రయత్నాలు చేయాలని ఇప్పటికే విజ్ఞప్తి చేశామన్నారు. ఈ మేరకు ఈ నెల 25న స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి, డైరెక్టర్ల బంగ్లాల ముట్టడి చేయాలని పోరాట కమిటీ నిర్ణయించిందని, కార్మికులు, నిర్వాసితులు, ఉక్కు ఉద్యోగులు పాల్గొని విజయవంతంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీనివాసరాజు, ఎన్.రమణ, ఎం.అప్పారావు, వివి.రమణ, ఎం.చంద్రరావు పాల్గొన్నారు.



మృతి చెందిన కోటిస్వాములు


గుండెపోటుతో హాస్టల్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

గుండెపోటుతో విద్యార్థి మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఆదివారం జరిగింది. హాస్టల్ వార్డెన్ వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల మండలంలోని గుత్తికొండ గ్రామానికి చెందిన మంద కోటిస్వాములు (13) పిడుగురాళ్లలోని మన్నెం పుల్లారెడ్డి జడ్‌పి పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి భోజనం అనంతరం స్టడీ అవర్‌లో చదువుకుంటుండగా ఒళ్లంతా చెమటలు పట్టడంతో వార్డెన్‌కు చెప్పి స్నానానికి వెళ్లాడు. స్నానం అనంతరం గదిలో బట్టలు మార్చుకుంటుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి విద్యార్థులు గమనించి వార్డెన్‌కు చెప్పారు. వారు ఆస్పత్రికి తీసుకెళ్లగా... గుండెపోటుతో అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

సుడాన్ ఘర్షణలో 56 మంది మృతి

- మరో 595 మందికి గాయాలు
- మృతుల్లో కేరళవాసి



ఖర్టూమ్ : సుడాన్‌లో సైన్యం, పారా మిలిటరీ దళాల మధ్య చెలరేగిన ఘర్షణల్లో కేరళకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగితోపాటు 56 మంది మరణించారు. మరో 595 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం కూడా తుపాకీ కాల్పులు, పేలుళ్లతో దేశమంతా దద్దరిల్లుతోంది. వరుసగా రెండోరోజూ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేశారు. సూడాన్ ఘర్షణల్లో కేరళలోని నెల్లిపర గ్రామానికి చెందిన 48 ఏళ్ల అగస్టిన్ మరణించినట్లు ఖర్టూమ్‌లోని భారత రాయబార కార్యాలయం గుర్తించింది. భారత సైన్యంలో పదవీ విరమణ చేసిన ఆయన గత ఏడాది నుంచి సూడాన్‌లోని డాల్ గ్రూప్‌లో సెక్యూరిటీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. యుకెలోని తన పెద్దకుమారుడికి ఫోన్ చేయడానికి కిటికీ తెరిచినప్పుడు తూటా తగిలింది. ఇటీవల ఆయన చిన్నకుమార్తె, భార్య సెలవుల కోసం సూడాన్ వచ్చారు. ఆ సమయంలోనే ఈ ఘటన జరగడం గమనార్హం.

సూడాన్‌లో రాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్‌ఎస్‌ఎఫ్)ను సైన్యంలో విలీనం చేయాలనే ప్రతిపాదన వచ్చిన దగ్గర నుంచి ఉద్రిక్తతలు ప్రారంభమయ్యాయి. ఎలా విలీనం చేయాలి, ఎవరు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలనే అంశాలపై సూడాన్ మిలటరీ కమాండర్ జనరల్ అబ్దుల్ ఫత్తా బుర్హాన్, ఆర్‌ఎస్‌ఎఫ్ అధిపతి జనరల్ మొహమ్మద్ హమ్దాన్ మధ్య నెల రోజులుగా చర్చలు జరుగుతున్నా ప్రతిష్టంభన కొనసాగింది. శనివారం అర్ధరాత్రి నుంచి రాజధాని ఖార్టూమ్‌సహా దేశవ్యాప్తంగా సైన్యం, పారా మిలటరీ మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు, కాల్పులు ప్రారంభమయ్యాయి. ఆదివారం నాటికి 56 మంది మరణించినట్లు ఒక వైద్యుల సిండికేట్ తెలిపింది. జన సంచారం ఉన్న ప్రాంతాల్లోనూ ఘర్షణలు జరుగుతున్నాయని, ఇలాంటి పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదని ఒమ్ దుర్మాన్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అమల్ మొహమ్మద్ తెలిపారు. ఆర్‌ఎస్‌ఎఫ్‌తో చర్చలు జరపబోమని, దానిని నిర్మూలిస్తామని సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. సూడాన్‌లో 2021లో సైన్యం, పారా మిలటరీ సంయుక్తంగా తిరుగుబాటు చేసి ప్రభుత్వంలోకి వచ్చాయి. ఘర్షణలను ఆపాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి గుటరస్, ఇయు విదేశాంగ విధాన చీఫ్, అరబ్ లీగ్ అధిపతి, ఆఫ్రికన్ యూనియన్ కమిషన్ చీఫ్, మిత్రదేశాలు ఖతార్, ఈజిప్టు, సౌదీ అరేబియా, యుఎఇ కోరాయి.

గ్రామ కంఠాలపై నిర్ణయాధికారం తహసీల్దార్లదే

- గెజిట్ విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ కంఠం భూములకు పట్టాలు జారీ చేసే అధికారం తహసీల్దార్లకు ప్రభుత్వం కట్టబెట్టింది. ఈ మేరకు శనివారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. గతేడాది భూముల రీసర్వే కోసం నియమించిన డిప్యూటీ తహసీల్దార్ల (డిటిల)కు ఈ అధికారం కల్పించారు.


తాజాగా డిటిల పాత్రను తొలగిస్తూ రెవెన్యూశాఖ ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల చట్టం (ఆర్‌ఓఆర్)-1971లో భాగంగా రూపొందించిన గ్రామకంఠం నిబంధనలు -2022కు కీలక సవరణలు చేసింది. ఈ మేరకు భూ పరిపాలన ముఖ్య కమిషనరు (సిసిఎల్‌ఎ) జి సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై అభ్యంతరాలు ఏమైనావుంటే 12 రోజుల్లోగా దరకాస్తు చేసుకోవాలని గెజిట్‌లో పేర్కొన్నారు.

ఏలేరు, తాండవ అనుసంధాన ప్రాజెక్టు

పంప్డ్ స్టోరేజి పవర్ కోసమా?

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

అదానీ, శ్రీ షిర్డీ సాయి సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు గిరిజనుల, రైతుల ప్రయోజనాలను ప్రభుత్వం ఫణంగా పెడుతోందని విమర్శలు ముసురుకుంటున్నాయి. ప్రజల నుంచి అభ్యంతరాలు, వ్యతిరేకత వ్యక్తమవుతున్నా సర్కార్ ముందుకే సాగుతోంది. ప్రయివేట్ సంస్థలకు అడ్డంకులు తొలగించడానికి కార్యాచరణ రూపొందించిందని పలువురు అంటున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీ ఐదో షెడ్యూల్‌లోని చింతపల్లి మండలం ఎర్రవరం వద్ద పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు (పిఎస్‌పి) ఏర్పాటుతో తాండవ జలాశయానికి వచ్చే నీటి వనరులు దెబ్బతిననున్నాయి. ఈ నేపథ్యంలో ఏలేరు, తాండవ కాలువల అనుసంధాన ప్రాజెక్టును ప్రభుత్వం ముందుకుతెచ్చింది. ఎర్రవరం వద్ద పిఎస్‌పి ఏర్పాటు కాకముందే తాండవ ఆయకట్టు స్థిరీకరణ, కొత్త ఆయకట్టుకు సాగునీటి అనుసంధాన ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. తాండవ ఆయకట్టుకు వచ్చే ముప్పును వివరిస్తూ, ఎర్రవరం పిఎస్‌పిపై అనేక అభ్యంతరాలు లేవనెత్తుతూ, కొన్ని సూచనలతో నీటిపారుదల శాఖాధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. జలాశయానికి వచ్చే ప్రవాహాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. ఏలేరు, తాండవ అనుసంధాన ప్రాజెక్టుకు 2021 మార్చి 19న ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ జిఒ 93 విడుదల చేసింది. రూ.470.05 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు గతేడాది డిసెంబరులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పిసిపి ఏర్పాటయ్యే నాటికి అనుసంధాన ప్రాజెక్టు పూర్తి కాకపోతే తాండవ ఆయకట్టుకు నీరు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడనుంది. ఈలోపు ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలన్న యోచనలో ప్రభుత్వముంది. ఎర్రవరం వద్ద పిఎస్‌పి ఏర్పాటును



ఏలేరు, తాండవ లింక్ ప్రాజెక్టు మ్యాప్

శ్రీ షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌కు, అనంతగిరి మండలం పెదకోట, రైవాడ జలాశయంపై పిఎస్‌పి ఏర్పాటును అదానీకి చెందిన అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఇజిఇఎల్)కు ప్రభుత్వం అప్పగించింది. తాండవ జలాశయం కింద 51,465 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆరు లిఫ్టులు (అనకాపల్లి జిల్లాలో మూడు, కాకినాడ జిల్లాలో మూడు) ఏర్పాటు చేయడం ద్వారా కాకినాడ జిల్లాలోని ఏలేశ్వరం, పత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, కోటనందూరు, తుని మండలాల్లో, అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం, నాతవరం, కోటవురట్ల మండలాల్లో ఆయకట్టు స్థిరీకరణ, కాకినాడ జిల్లాలోని రౌతులపూడి, పత్తిపాడు, శంఖవరం మండలాల్లో కొత్తగా 5,600 ఎకరాలకు సాగునీటి సౌకర్యం లభించనుందని ఏలేరు కాలువ, తాండవ అనుసంధాన ప్రాజెక్టు నివేదికలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల తాండవ జలాశయానికి నీటి సమస్య తొలగుతుందనిచెబుతున్నారు.

నేడు ప్రభుత్వ ఇఫ్తార్ విందు

- హాజరుకానున్న సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రంజాన్ పండుగ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు సోమవారం ఇఫ్తార్‌ను ఇవ్వనుంది. విజయవాడలోని విద్యాధర పురంలోని మినీ స్టేడియంలో జరిగే ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నారు. ఇఫ్తార్‌లో పాల్గొనేందుకు తాడేపల్లిలోని తన నివాసం నుండి సాయంత్రం 5.30 గంటలకు సిఎం బయలుదేరి విద్యాధరపురానికి చేరుకుంటారు. ఇఫ్తార్‌ను ముగించుకొని రాత్రి 7.30 గంటలకు తిరిగి తాడేపల్లికి చేరుకుంటారు.

ఇప్పటికైనా సిఎం స్పందించాలి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి వుంటే ఇప్పటికైనా మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు అంశంపై స్పందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వివేకానందారెడ్డి హత్య కేసులో పురోగతి సాదించేందుకు సిబిఐకి నాలుగేళ్ల సమయం పట్టిందన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డిని అరెస్టుతో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. వివేకానందరెడ్డి హత్యను గుండెపోటుగా చిత్రీకరించడం నుండి తలకు అయిన గాయాలకు కుట్లువేసి సహజ మరణంగా చిత్రీకరించేందుకు ఎవరెవరు ప్రయత్నించారో రాష్ట్ర ప్రజలకు, పోలీసులకు తెలుసునని ఆయన పేర్కొన్నారు. వివేకానందరెడ్డి హత్యకేసులో దోషులు ఎవరైనాసరే కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

బాలికపై కానిస్టేబుల్ అత్యాచారం

ప్రజాశక్తి - పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

బాలికపై కానిస్టేబుల్ అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. దీనిపై పిడుగురాళ్ల పట్టణ సిఐ ఆంజనేయులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి బాధిత బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా నిందితుడిని విచారణ చేస్తుండగా అతని భార్య ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు గమనించి ఆమెను ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

కందుకూరి ఆశయాలు శిరోధార్యం

- 175వ జయంతి సభలో వక్తలు
- అలరించిన నృత్య రూపకం



సభలో మాట్లాడుతున్న నృత్య రూపకం రచయిత దేవేందర్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

సమాజ వికాసం కోసం, మత మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా కందుకూరి చేసిన పోరాటాలు, సాధించిన విజయాలు భావితరానికి శిరోధార్యమని కందుకూరి 175వ జయంతి సభలో వక్తలు కొనియాడారు. హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సంస్కరణోద్యమ ఖడ్గధారి కందుకూరి వీరేశలింగం జీవితంపై నృత్య రూపకం ప్రదర్శించారు. సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ రాజమహేంద్రవరం, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక, విద్యార్థి యువజన, మహిళా, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యాన నగరంలోని ఆనం కళాకేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు, యువత పాల్గొని వీక్షించారు. ఎస్‌కెవిటి పూర్వ విద్యార్థి బి.పవన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నృత్య రూపకం రచయిత దేవేందర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, వితంతువులకు పునర్వివాహం, వివేక వర్ధిని పత్రికా సంపాదకునిగా అవినీతిపై ఆయన చేసిన పోరాటం ఎంతో గొప్పవన్నారు. అనేకమంది ఘర్షణలకు దిగినా, భౌతికదాడులకు పాల్పడినా వెనుకంజ వేయని మహనీయుడని కొనియాడారు. విద్యా సంస్థలను నెలకొల్పడంతోపాటు శాస్త్ర విజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు ఆంగ్ల భాషను సాధనంగా వినియోగించి ప్రజలలో చైతన్యం నింపారని గుర్తు చేశారు. ఎస్‌కెవిటి పూర్వ విద్యార్థి, పూర్వ విద్యార్థి నాయకులు టి.అరుణ్ మాట్లాడుతూ కందుకూరి జీవితం మొత్తం కుల నిర్మూలన, స్త్రీ విముక్తి, సంఘ సంస్కరణకు అనేక కష్ట నష్టాలను ఎదుర్కొని వీరోచిత పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.విజయగౌరి, బి.రాజు లోవ, ఎ.షరీఫ్, చిలుకూరి శ్రీనివాస్, జె.రూపస్‌రావు, నత్యరూపకం దర్శకులు జగ్గరాజు, ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ పి.పావనమూర్తి, పూర్వ మేనేజర్ టిఎస్.ప్రకాష్, మహిళా సంఘం నాయకులు టి.సావిత్రి, విద్యార్థి సంఘం నాయకులు ఎన్.రాజా, ప్రజా నాట్యమండలి కళాకారులు మహంతి లక్ష్మణరావు, ఉపాధ్యాయులు టి.ఏసుబాబు, సురేష్, కార్మిక సంఘాల నాయకులు నల్లా రామారావు పాల్గొన్నారు.

అలరించిన నత్య రూపకం

హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కందుకూరి వీరేశలింగం సంగీత నృత్య రూపకం ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. తొలుత మూఢ భార్య, మంచి భర్త, అనాటి ఆచారావు అనే రెండు ప్రహసనాలు ప్రదర్శించారు. ఈ నాటికలు అచారాల వెనుక అశాస్త్రీయత, ఆనాటి సాంఘిక దురాచారాలను, అణగారిన వర్గాలపై ఆడిపోసుకోవడం వంటి సన్నివేశాలకు నటీ నటులు జీవం పోశారు. సభ అనంతరం ప్రదర్శించిన నత్య రూపకం సాంఘిక దురాచారాలను ఎండగట్టేందుకు కందుకూరి వీరేశలింగం చేసిన పోరాటాలను అద్దం పట్టింది. మత చాంధసవాదులను ఎదిరించి సంఘ సంస్కరణ కోసం కందుకూరి చూపిన తెగువ, వీరోచిత పోరాటాలను నటీనటులు చక్కగా ప్రదర్శించారు.



టింబర్ డిపోలో అగ్ని ప్రమాదం

- పక్కనే ఉన్న భవనంలోకి మంటలు
- దంపతులతో సహా చిన్నారి సజీవ దహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో మరో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కుషాయిగూడలోని ఓ టింబర్ డిపోలో ఆదివారం తెల్లవారుజామున మంటలు చెలరేగి.. పక్కనే ఉన్న భవనంలోకి వ్యాపించడంతో అందులో ఉన్న దంపతులతో సహా ఓ చిన్నారి సజీవ దహనమయ్యారు. వివరాల్లోకెళ్తే.. యాదాద్రి భువనగిరి జిల్లా తుంగతుర్తికి చెందిన నరేశ్, సుమ దంపతులు రెండేండ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి కుషాయిగూడలోని సాయినగర్ కాలనీలో వారి ఇద్దరి కొడుకులతో కలిసి నివసిస్తున్నారు. నరేశ్ ఓ గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వీరు నివసిస్తున్న భవనం పక్కనే ఉన్న టింబర్ డిపోలో మంటలు చెలరేగాయి. అవి అలాగే వ్యాపించి భవనానికి అంటుకోగా నరేశ్ (35), సుమ (28), వారి చిన్న కొడుకు జోషిత్(5) సజీవ దహనమయ్యారు. పెద్ద కుమారుడు సమీప బంధువుల ఇంట్లో పడుకోవడంతో ప్రమాదం బారి నుంచి తప్పించుకున్నాడు. అగ్ని మాపక సిబ్బంది, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం గురించి ఆరా తీశారు. బాధిత కుటుంబానికి రూ.6 లక్షల సాయాన్ని అందిస్తామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రకటించారు. టింబర్ డిపో యాజమాన్యం నుంచి రూ. 25 లక్షలు పరిహారం అందేలా ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి చొరవ తీసుకున్నారు. ముందుగా రూ. 2 లక్షలు అందించిన టింబర్ డిపో యాజమాన్యంతో ఎమ్మెల్యే మాట్లాడి మిగతా రూ. 23 లక్షలకు సంబంధించిన చెక్కులను బాధిత కుటుంబానికి అందజేసేలా చర్యలు తీసుకున్నారు.

మధ్యవర్తిత్వమే సత్వర పరిష్కారమార్గం

- మాజీ సిజెఐ జస్టిస్ ఎన్‌వి రమణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమస్యల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తోందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ అన్నారు. హైదరాబాద్‌లోని అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఎఎంసి)లో నిర్వహించిన 'ఇండియా మీడియేషన్ డే' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ మీడియేషన్ కేంద్రం ఏర్పాటు వెనుక జస్టిస్ లావు నాగేశ్వరరావు కషి ఎంతో ఉందన్నారు. మధ్యవర్తిత్వ కేంద్రం ఏర్పాటుకు జస్టిస్ హిమాకోహ్లీ కూడా ఎంతో సహకరించారని పేర్కొన్నారు. ప్రస్తుతకాలంలో మధ్యవర్తిత్వ ప్రాధాన్యం క్రమంగా పెరుగుతోందన్నారు. దీనివల్ల ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే బాధ తప్పుతుందన్నారు. మధ్యవర్తిత్వ ప్రస్తావనలు మన ఇతిహాసాల్లోనూ ఉన్నాయని, కౌరవులు, పాండవులు మధ్య కష్ణుడి మధ్యవర్తిత్వం విఫలం వల్లే మహాభారత యుద్ధం జరిగిందని ఆయన చెప్పారు. ఈ ప్రక్రియ విశ్వసనీయతతో వేగవంతంగా సాగాలని, ఉభయపక్షాలకు ఉపయోగకరంగా మధ్యవర్తిత్వ ప్రక్రియ ఉండాలని తెలిపారు. దీనిలో కత్రిమమేధనూ భాగం చేస్తున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ రవీంద్రన్, సింగపూర్ అంతర్జాతీయ మీడియేషన్ సెంటర్ ఛైర్మన్ జార్జ్ లిమ్ తదితర న్యాయకోవిదులు పాల్గొన్నారు.

అంతా సక్రమమే!

- అనంతపురం పంటల బీమా అక్రమాలపై క్లీన్‌చిట్
- సిఎంఒ ఆదేశాలు బేఖాతరు
- చేతివాటంతోనే..

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా పరిహారం పంపిణీలో అక్రమాలపై ఉమ్మడి అనంతపురంలో చేపట్టిన విచారణ ఫార్స్‌గా తయారైంది. 2021 ఖరీఫ్‌లో సంభవించిన పంట నష్టాలపై ప్రభుత్వం విడుదల చేసిన సొమ్ము పంపిణీలో భారీగా అవకతవకలు జరిగాయని గుర్తించిన ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఒ) సమగ్ర దర్యాప్తునకు ఆదేశించగా, అధికారులు తూతూమంత్రంగా విచారించి అందరికీ క్లీన్‌చిట్ ఇచ్చేశారు. కొంత మంది విచారణాధికారులు చేతివాటం ప్రదర్శించి అవినీతి జరగలేదని సర్టిఫికెట్ ఇచ్చినట్లు తెలిసింది. ఇ-క్రాప్, ఇ-కెవైసి నమోదుల్లో ఉద్దేశపూర్వకంగా అనర్హులను చేర్చడం వలన ఇన్సూరెన్స్ సొమ్ము పక్కదారి పట్టిందని, అర్హులకు అన్యాయం జరిగిందని రాష్ట్ర వ్యాప్తంగా రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ తరుణంలో ఉమ్మడి అనంతపురంలో జరిగిన ప్రత్యేక విచారణ ప్రభుత్వంలో, వ్యవసాయశాఖలో చర్చనీయాంశం అయింది.

ఇ-క్రాప్‌తోనే...

2021 ఖరీఫ్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో విపత్తుల వలన భారీగా పంట నష్టాలు సంభవించడంతో ప్రభుత్వం 2022 జూన్‌లో రూ.855 కోట్ల పరిహారం విడుదల చేసింది. పంపిణీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ర్యాండమ్‌గా (మచ్చుకు) నిర్వహించిన క్షేత్ర స్థాయి సర్వే ద్వారా ప్రభుత్వ దృష్టికి వచ్చింది. విచారణ జరిపించాలంటూ సిఎంఒలోని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచనల మేరకు ఆయన పర్సనల్ సెక్రటరీ ద్వారా వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదికి గత నెల 9న ఆదేశాలు అందాయి. ఎంక్వయిరీ చేయాలంటూ మార్చి 14న ద్వివేది నుంచి వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్‌కు ఆదేశాలు వెళ్లాయి. ర్యాండమ్ చెకింగ్‌లో నిర్ధారించిన వివరాలను ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామ వలంటీర్లపై ఆధారపడ్డ ఆర్‌బికెల సిబ్బంది, వారు చెప్పిన వివరాలను ఇ-క్రాప్‌లో ఎక్కించారు. అసలు పంటలు సాగు చేయకుండా బీడుపెట్టిన రైతులు పంటలు సాగు చేసినట్లు రాశారు. కొంత విస్తీర్ణంలో పంటలు వేయగా ఎక్కువ విస్తీర్ణంలో పంటలు వేసినట్లు రాశారు. ఒక పంట సాగు చేస్తే వేరే పంట నమోదు చేశారు. అప్పట్లో అనంతపురం జిల్లాలో వేరుశనగ, మిర్చి, కంది పంటలకు నష్టం జరిగింది. మిర్చికి సర్కారు హెక్టారుకు రూ.60 వేలు పరిహారం ఇచ్చింది. వేరుశనగ, కందులకు రూ.4 వేలు. సిబ్బంది. కాగా అందరూ వేరుశనగ సాగు చేశారని ఎక్కించారు. పంటల నమోదు తప్పుగా నమోదు చేయడం వలన మిర్చి సాగు చేసిన రైతులకు రూ.4 వేలు వచ్చింది. వేరుశనగ, కంది సాగు చేసిన వారికి ఏకంగా రూ.60 వేలు వచ్చింది. ఈ అవకతవకలు ర్యాండమ్ చెకింగ్‌లో బయట పడ్డాయి. కిందిస్థాయి సిబ్బంది తయారు చేసిన జాబితాలను పర్యవేక్షణాధికారులు నిర్లక్ష్యం వహించి ఆమోదం తెలిపారని తేలింది. ఎక్కడ ఎవరు బాధ్యులో ఎంత సొమ్ము దుర్వినియోగం అయిందో పూర్తి వివరాలు సిఎంఒ నుంచి పంపారు.

కాసులకు కక్కుర్తి

సాక్షాత్తు సిఎంఒ విచారణకు ఆదేశించినప్పటికీ కిందిస్థాయిలో విచారణ లోపభూయిష్టంగా సాగింది. లంచాలు తీసుకున్న విచారణాధికారులు అసలు తప్పులేమీ జరగలేదని, అంతా సక్రమమేనని ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నట్లు సమాచారం. ర్యాండమ్ చెకింగ్‌లో పేర్కొన్న మొత్తం 83 కేసులపై విచారణ జరిపి అంతా ఒకే అంటున్నారు. ఒక డివిజన్‌లో ఆరోపణలొస్తే పక్క డివిజన్ అధికారులు నామ్‌కేవాస్తే దర్యాప్తు చేసి మమ అనిపించారని ఆరోపణలొస్తున్నాయి.

పదవీ విరమణ వయస్సుపై విద్యుత్ శాఖలో సందిగ్ధత

- 62కు పెంచాలన్న కోర్టు ఉత్తర్వులు బేఖాతరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ శాఖలో పదవి విరమణ వయస్సుపై సందిగ్ధత నెలకొంది. పదవి విరమణ వయస్సును పెంచుతారా? లేదా? అనే ఆందోళనలో విద్యుత్ ఉద్యోగులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచిన విషయం తెలిసిందే. అయితే దీనిని ప్రభుత్వ రంగ కార్పొరేషన్లు, కంపెనీలు, సహకార సంస్థల వంటి వాటికి రాష్ట్ర ప్రభుత్వం వర్తింపచేయలేదు. జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలకు కంపెనీ చట్టాల నిబంధనలు వర్తిస్తాయి. ఈ కార్పొరేషన్లు, కంపెనీల్లో ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సు పెంపు ఇష్టానుసారం చేయొద్దని, ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం అనుమతి తీసుకొని మాత్రమే అమలు చేయాలని తెలిపింది. అయితే తమకు కూడా పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని విద్యుత్ శాఖ ఉద్యోగులతో పాటు, యూనియన్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ అంశంపై ఇప్పటి వరకు ఎలాంటి స్పందన ప్రభుత్వం నుంచి లేదు. దీంతో కొంతమంది ఉద్యోగులు కోర్టును ఆశ్రయించడంతో సానుకూలంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపచేసిన్నట్లే పదవి విరమణ వయస్సును 62 ఏళ్లు వర్తింపచేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కానీ కోర్టు ఉత్తర్వులను అమల్జేయడం లేదు. కోర్టును ఆశ్రయించినవారిలో ఇటీవల 60 ఏళ్లు పూర్తి చేసుకొని పదవి విరమణ పొందిన ఉద్యోగులూ ఉన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే కోర్టు ఉత్తర్వులను అమల్జేసి తమకు 62 ఏళ్ల వరకు ఉద్యోగాలను కొనసాగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే దీనిపై ఉన్నతాధికారులు స్పందించడం లేదు. గతంలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీవిరమణ వయస్సును 58 నుంచి 60 ఏళ్లకు పెంచినప్పుడు కూడా విద్యుత్ శాఖ ఉద్యోగులు కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఆ సమయంలో ప్రభుత్వం కోర్టు ఉత్తర్వులు అమలు చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఇచ్చిన ఉత్తర్వులను అమల్లోకి తీసుకొచ్చి తమకు న్యాయం చేయాలని ఇటీవల పదవీవిరమణ పొందిన ఉద్యోగులు, ప్రస్తుతం పదవీవిరమణ వయస్సుకు సమీపించిన ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చిట్‌ఫండ్స్ వ్యవహారాలకు సంబంధించి ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఒక రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించిన సీనియర్ న్యాయవాదులు, జర్నలిస్టులు, అడిటర్లకు సిఐడి నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించనున్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో విధులు బహిష్కరించి న్యాయవాదులు తమ నిరసన తెలియజేయనున్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దీనిని హరించే అధికారం పోలీసులకు ఉందా? అని ఐలు ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించింది. పోలీసుల అప్రజాస్వామిక చర్యలను ఖండిస్తూ ఈ నిరసన కార్యక్రమం సోమవారం చేపడుతున్నట్లు వెల్లడించింది.

న్యాయవాదులకు నోటీసులివ్వడం దుర్మార్గం

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్గదర్శిపై మాట్లాడిన న్యాయవాదులకు సిఐడి నోటీసులు ఇవ్వడం దుర్మార్గమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ చేతిలో సిఐడి కీలుబొమ్మలా మారిందని ఆయన ఆరోపించారు. సిఐడి వ్యవహరిస్తున్న తీరు చూసి తెలుగు ప్రజలు నవ్వుకుంటున్నారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత, టిడిపి సీనియర్ నేత యనమల రామకృష్ణుడు మరో ప్రకటనలో పేర్కొన్నారు. మార్గదర్శిపై లేనిపోని తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రతీకార చర్యలకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. నాన్ బ్యాంకింగ్ చిట్‌ఫండ్ సంస్థలు తన కమీషన్‌ను పెట్టుబడులుగా పెట్టరాదని సిఐడి నిరూపించగలదా? అని నిలదీశారు. సిఐడి ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలని కోరారు.

సిఐడి నోటీసులు వెనక్కి తీసుకోవాలి

కొలనుకొండ శివాజీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భావప్రకటనా స్వేచ్ఛను హరించే విధంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరుకు నిరసనగా బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం చేపట్టనున్న కోర్టుల బహిష్కరణ కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు, సంఘీభావం ప్రకటిస్తున్నట్లు ఎఐసిసి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలనుకొండ శివాజీ తెలిపారు. న్యాయవాధులకు ఇచ్చిన నోటీసులను సిఐడి వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చిట్స్ వ్యవహారాలకు సంబంధించి అభిప్రాయాలు వెల్లడించడమే నేరమన్నట్టుగా ఎపి ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షులు నేతి మహేశ్వరరావు, ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ తదితరులకు నోటీసులు ఇవ్వడం కక్షపూరిత చర్యగానే భావించాల్సి వస్తుందని తెలిపారు. చార్టెండ్ అకౌంటెంట్ అరెస్టుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన వారికి నోటీసులు ఇవ్వడం రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించడమేనని తెలిపారు.

వివేకా హత్య కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్ట్

(మొదటిపేజి తరువాయి)

తీసుకోవాలని జైలు అధికారులకు సూచించారు. కస్టడీ పిటిషన్‌పై భాస్కర్‌రెడ్డి తరఫు న్యాయవాదులు సోమవారం సిబిఐ న్యాయస్థానంలో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయనున్నారు. భాస్కర్‌రెడ్డిని చంచల్‌గూడ జైలుకు సిబిఐ అధికారులు తరలించారు. సిబిఐ అధికారులు గతంలో వైఎస్ భాస్కర్‌రెడ్డిని పలుమార్లు విచారించడం, రెండ్రోజుల క్రితం అవినాష్‌రెడ్డి అనుచరుడు ఉదయ్‌కుమార్‌రెడ్డిని, ఈ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేయడం తెలిసిందే.

భాస్కర్ రెడ్డి ఆదేశాలతోనే వివేకా హత్యకు కుట్ర
రిమాండ్ రిపోర్టులో సిబిఐ

2017లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి వివేకానంద రెడ్డి, భాస్కర్‌రెడ్డి మధ్య వివాదం ఉందని, భాస్కర్ రెడ్డి ఆదేశాలతోనే వివేకా హత్యకు కుట్ర జరిగిందని సిబిఐ అధికారులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. 'ఈ కేసులో కీలక సాక్షులను అనుచరుల ద్వారా భాస్కర్ రెడ్డి ప్రభావితం చేస్తున్నారు. దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారు. విచారణకు సహకరించడం లేదు. హత్యా స్థలంలో ఆధారాలు చెరిపేయడంలో భాస్కర్‌రెడ్డిది కీలక పాత్ర. వివేకా హత్యలో సహ నిందితులకు పెద్ద మొత్తంలో డబ్బు అందింది. సిఐ శంకరయ్యను భాస్కర్‌రెడ్డి బెదిరించారు. భాస్కర్ రెడ్డి తప్పించుకునే అవకాశం ఉంది. అందుకే అరెస్టు చేశాం' అని సిబిఐ అధికారులు కోర్టుకు అందజేసిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

వైసిపి నిరసన

అరెస్టు సమాచారం తెలియడంతో వందలాది మంది వైసిపి కార్యకర్తలు వైఎస్ భాస్కర్‌రెడ్డి ఇంటికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అరెస్టుకు నిరసనగా వైసిపి శ్రేణులు వైఎస్‌ఆర్ జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో ర్యాలీలు చేపట్టాయి. పులివెందులలో దుకాణాలను మూసివేశారు.

పెద్ద చేపలు తాడేపల్లి ప్యాలెస్‌లో : బిటెక్ రవి

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపి అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి చిన్న చేపలని, పెద్ద చేపలు తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రారెడ్డి (రవి) ఆరోపించారు. వివేకా కుమార్తె డాక్టర్ సునీత చేసిన పోరాటానికి భాస్కర్‌రెడ్డి అరెస్టుతో కొంత న్యాయం జరిగిందన్నారు. వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ భాస్కర్ రెడ్డి అరెస్ట్‌పై టిడిపి శ్రేణులు ఎవరూ రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో ప్రకటనలు చేయవద్దని కోరారు.

అవినాష్‌రెడ్డికి మళ్లీ నోటీసులు

వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి వై.ఎస్.అవినాష్‌రెడ్డికి సిబిఐ మరోమారు నోటీసులు జారీ చేసింది. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు హైదరాబాదులోని సిబిఐ కార్యాలయానికి హాజరు కావాలని ఈ నోటీసులో పేర్కొంది. ఈ మేరకు ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు ఆయనకు ఫోన్ ద్వారా సిబిఐ సమాచారం ఇచ్చింది.

చెంచులపై కేంద్రం వివక్ష

- పక్కా ఇళ్ల నిర్మాణానికి అడ్డుగా అటవీ చట్టాలు
- వేసవిలో కాలిపోతున్న చెంచు గూడేలు
- పౌష్టికాహార లోపంతో అనారోగ్యంపాలు
- గొడ్డలిపెట్టుగా మారుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణాలోనే కాక దేశంలోనే అత్యంత వెనుకబడిన తెగలలో చెంచు జాతి ఒకటి. దట్టమైన అడవిలో మానవ సమాజానికి దూరంగా ఉండే పెంట (గూడెం)ల్లో జీవిస్తున్నారు. పేరుకు తగ్గట్టుగానే చెంచుల పరిస్థితి దయనీయం. నేటికి వీరిలో 10 శాతమే అక్షరాస్యత ఉంది. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య వీరు నలిగిపోతున్నారు. గిరిజన జాతికి చెందిన మహిళ రాష్ట్రపతి పదవిలో ఉన్నా.. వీరి జీవితాల్లో మాత్రం మార్పులేమీ లేవు. అడవి గడ్డి, ఆకులతో వేసుకున్న పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారు. ఎండాకాలం అడవిలో మంటలు చెలరేగినప్పుడల్లా గుడిసెలు అగ్నికి ఆహుతవుతూ ప్రాణ నష్టంతోపాటు సర్వం బుగ్గిపాలై కట్టుబట్టలతో నిలువనీడలేక అల్లాడుతున్నారు.

అంతరించిపోతున్న చెంచు జాతిని కాపాడాలనే ఉద్దేశంతో 1975లో చట్టం వచ్చినా ఫారెస్టు, రెవెన్యూ శాఖల మధ్య వీరు సతమతమౌతున్నారు. పౌష్టికాహారం లేక శుభ్రమైన సమతుల్యమైన ఆహారం లోపించి, రక్తహీనత, డయోరియా, మలేరియా, క్షయ, వైరల్ ఫీవర్‌తో ఇబ్బంది పడుతూ చికిత్స అందక చనిపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన సామాజిక వర్గాల కోసం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద పక్కా ఇండ్లను నిర్మిస్తే చెంచుల జీవన ప్రమాణాలు పెరిగి చెంచు జాతి అభివృద్ధిలోకి వస్తుంది.

నల్లమల అటవీ ప్రాంతంలో 130 చెంచు పెంటలున్నాయి. వీటి పరిధిలో 7 వేల జనాభా ఉంది. ఆగర్లపెంటలో 8 కుటుంబాలు, రాంపూర్ పెంటలో 20, అప్పాపూర్‌లో 30, పుల్లయ్యపల్లిలో 6, భౌరాపూర్‌లో 8, మేడిమల్కలలో 30, గుండాలలో 20, ఈర్లపెంటలలో 50, లింగభేరిలో 4, సార్లపల్లిలో 4 కుటుంబాలున్నవి.



రాంపూర్ పెంటలో 20 చెంచు కుటుంబాలు పూరి గుడిసెల్లో జీవిస్తున్నాయి. ఈ మధ్యనే అర్ధరాత్రి మంటలు చెలరేగి 4 పూరిగుడిసెలు, ఒక అంగన్వాడీ కేంద్రం కాలిపోయి సర్వం కోల్పోయారు.

రాంపూర్ పెంటకు చెందిన చిగుర్ల పెద్ద బయ్యన్నకు 6 మంది సంతానం కాగా.. సొంత సాగు భూమి లేదు. అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో అడవి అంటుకొని గుడిసె కాలి బూడిదైంది. పిల్లా పాపలతో నిద్రిస్తున్న సమయంలో మంటలు చెలరేగగా.. తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కాట్రావత్ లక్ష్మమ్మ-అంకులయ్య దంపతులకు నలుగురు పిల్లలున్నారు. 3 సంవత్సరాలుగా ఉపాధి పనులు లేక అటవీ ఫలాల మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. అడవిలో ఉంటూ ఆకులు, అలమలు తింటున్న వీరి గుడిసె అగ్నికి ఆహుతైంది. సోలార్ ప్లేట్, రేషన్ బియ్యంతోపాటు సర్వం కాలిపోయి చెట్ల కింద జీవనం సాగిస్తున్నారు. చిగుర్ల లక్ష్మయ్య- సలేశ్వరి, వారి తండ్రి చిగుర్ల పెద్ద బయ్యన్నకు చెందిన రెండు గుడిసెలు కాలిపోయి సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఇప్పుడు చెట్ల కిందనే ఆశ్రయం పొందుతున్నారు. నిమ్మల లింగస్వామి, తోకల గురువయ్య, కాట్రాజు లింగయ్య, సలేశ్వరంకు పూరి గుడిసెలే వున్నాయి. అప్పాపూర్‌లో మరో 15 మంది చెంచులకు పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాల్సి ఉంది. పక్కా ఇండ్ల నిర్మాణం విషయంలో అటవీ అధికారులు, రెవెన్యూ శాఖల మధ్య సఖ్యత లేక చెంచులకు ముందుకు సాగడం లేదు.

కేంద్రం వివక్ష వల్లే..

ఆది నుంచి ఆదిమ జాతి చెంచులపై కేంద్ర ప్రభుత్వం వివక్ష కొనసాగుతూనే వుంది. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. అంతరించిపోతున్న చెంచు జాతిని రక్షించడానికి 1975లో చట్టాలు తీసుకొచ్చినా అమలుకు నోచుకోవడం లేదు. చెంచుల ద్వారా సేకరించిన అటవీ సంపదను, వారి సమీపంలో వున్న కృష్ణానది నీటిని పట్టణాలకు తరలిస్తున్నారు కాని చెంచుల దాహార్తిని తీర్చడం లేదు. పక్కా ఇండ్ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకాన్ని తమకెందుకు వర్తింపజేయడం లేదని చెంచులు ప్రశ్నిస్తున్నారు.

చెంచుల జీవన ప్రమాణాలు పెంచాలి

నల్లమల అటవీ ప్రాంతంలో ఆదిమజాతి చెంచులు అభివృద్ధికి దూరంగా వున్నారు. వీరికి పక్కా ఇండ్లు లేక ఎండకు ఎండి, వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. పౌష్టికాహారం లేక రోగాలు చుట్టుముట్టి చనిపోతున్నారు. చెంచు జాతిని రక్షించుకోవడానికి తీసుకొచ్చిన 1975 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. ముఖ్యంగా ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద కేంద్రం నిర్మించతలపెట్టిన పక్కా గృహాలను చెంచులకు ఇవ్వాలి. మెరుగైన వనరులు కల్పించడం ద్వారా జీవన ప్రమాణాలు పెరుగుతాయి. ముఖ్యంగా పక్కా గృహాల నిర్మాణానికి అడ్డుగా వున్న అటవీ చట్టాలను సడలించాలి. కేంద్ర ప్రభుత్వమే చెంచులకు న్యాయం జరిగేలా చూడాలి.

శంకర్ నాయక్-గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

సిఎం 'అనంత' పర్యటన 26కు వాయిదా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లాలో సోమవారం నాడు చేపట్టాల్సిన పర్యటన రద్దయ్యింది. ఈ పర్యటన తిరిగి ఇదే నెల 26న జరుగుతుందని సిఎంఒ పేర్కొంది. ఇదివరకు ఇచ్చిన షెడ్యూలు ప్రకారం.. ఈ నెల 17న 'జగనన్న వసతి దీవెన' నగదు విడుదల కార్యక్రమాన్ని నిర్వహించాల్సివుండేది. అయితే మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి తండ్రి, సిఎం భార్య భారతి మేనమామ వైఎస్ భాస్కర్‌రెడ్డిని సిబిఐ అరెస్టు చేసిన నేపథ్యంలో అనంత పర్యటన వాయిదా పడటం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.

పైసా ఉద్యమ స్ఫూర్తితో బిడ్

- ఉక్కును పరిరక్షించుకునేందుకు కృషి : జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - పాలకొల్లు (పశ్చిమగోదావరి)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని, అందుకే 1980లో వావిలాల గోపాలకృష్ణయ్య పైసా ఉద్యమం స్ఫూర్తితో పని చేస్తున్నానని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఓ ప్రయివేటు కార్యక్రమానికి వచ్చిన ఆయన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జీతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం తరుపున బిడ్ వేయలేదని, తాము పైసా ఉద్యమం స్ఫూర్తితో ప్రతి తెలుగు కుటుంబం నెలకు రూ.100 ఇస్తే రూ.850 కోట్లు వస్తుందని, అందుకే బిడ్ దాఖలు చేశానన్నారు. తాను రాజకీయాల్లోనే ఉన్నానని, వచ్చే ఎన్నికల్లో విశాఖ నుంచి పోటీ చేస్తానని తెలిపారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై 25, 26 తేదీల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 25, 26 తేదీల్లో జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా చేపట్టనున్నట్లు ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో 26 జిల్లాల కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాల సమావేశం ఆ సంఘం రాష్ట్ర ఛైర్మన్ కె సుమన్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు, ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర పబ్లిసిటీ సెక్రటరీ బి కిషోర్‌కుమార్, అన్ని జిల్లాల కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమాలు

నూజివీడులో సిపిఎం భవన నిర్మాణ సభలో వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నూజివీడు (ఏలూరు)

పుచ్చలపల్లి సుందరయ్య పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు సిపిఎం కార్యాలయం వేదిక కావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఏలూరు జిల్లా నూజివీడులో సిపిఎం నూతన కార్యాలయ భవన నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. నూతనంగా నిర్మిస్తున్న ఈ భవనానికి పుచ్చలపల్లి సుందరయ్య భవనంగా నామకరణం చేసి ఉద్యమాలకు ఊపిరులూదాలన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక మత విద్వేషం రెచ్చగొడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బహిరంగంగా చైనాను విమర్శిస్తూ, అంతర్గతంగా చైనాతో బంధం కొనసాగిస్తూ జాతీయ జెండాల నుంచి దేవుని ప్రతిమల వరకూ అన్నీ కొనుగోలు చేయడం బిజెపి ద్వంద్వవైఖరికి నిదర్శనమన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమాలకు ఏలూరు జిల్లా పుట్టినిల్లు అని గుర్తు చేశారు. సిపిఎం కార్యాలయాలు పార్టీ తీర్మానాలకు మాత్రమే కాదని, పోరాటాలకు, సేవలకు కేంద్రాలుగా విరాజిల్లుతున్నా యన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, సీనియర్ నాయకులు వై.కేశవరావు, సిపిఐ రాష్ట్ర నేత చలసాని రామారావు, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ జి.రాజు, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు, నేతలు

ఆలూరు మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి మృతి

భర్త వర్ధంతి కార్యక్రమానికి వస్తుండగా రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి - ఆలూరు (కర్నూలు)




నీరజారెడ్డి

రోడ్డు ప్రమాదంలో కర్నూలు జిల్లా ఆలూరు మాజీ ఎమ్మెల్యే పాటిల్ నీరజారెడ్డి (55) మరణించారు. తన భర్త, మాజీ ఎమ్మెల్యే పాటిల్ శేషిరెడ్డి వర్ధంతి కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు ఆమె ఆదివారం హైదరాబాద్ నుంచి కర్నూలుకు వస్తుండగా పెబ్బేరు - భీచుపల్లి వద్ద కారు టైర్ పేలిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం తెర్నేకల్‌లో తన భర్త శేషిరెడ్డి వర్ధంతి కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్ నుంచి కర్నూలుకు వస్తుండగా కారు టైర్ పేలిపోవడంతో అదుపు తప్పి బోల్తా కొట్టింది. కారు డ్రైవర్‌కు, నీరజారెడ్డికి తీవ్ర గాయలవ్వడంతో వారిని కర్నూలులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నీరజారెడ్డి మరణించారు. 2004లో పత్తికొండ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నీరజారెడ్డి పోటీ చేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. 2009లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఆమె బిజెపిలో కొనసాగుతున్నారు. నీరజారెడ్డి భర్త 1989లో పత్తికొండ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1996లో గోనెగండ్లలో ప్రత్యర్థుల చేతిలో హత్యగావింపబడ్డారు. భర్త చనిపోవడంతో నీరజా రెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆమెకు ఒక కుమార్తె ఉన్నారు. నీరజారెడ్డి మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.



సురేష్



దినేష్



సుబ్బయ్య

కడప జిల్లాలో ఘోర ప్రమాదం

- ముగ్గురు యువకులు మృతి

ప్రజాశక్త- కడప అర్బన్

కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాజంపేట-కడప జాతీయ రహదారిపై చెన్నూరు మండలం పాలెంపల్లె వద్ద ఆదివారం తెల్లవారుజామున బైక్‌ను లారీ వేగంగా ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూరు మండలం బేస్తకాలనీకి చెందిన సురేష్ (23), దినేష్ (26), సుబ్బయ్య (19) ఒంటిమిట్టలో గంగమ్మ జాతరను చూసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. జాతరను తిలకించిన అనంతరం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కడప పట్టణ శివారులోని రాజంపేట-కడప బైపాస్ రోడ్డు వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి చెన్నైకి వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలపై ఆరా తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ ప్రభుత్వాస్పత్రి తరలించారు. కమలాపురం ఎమ్మెల్యే పి.రవింద్రనాథరెడ్డి, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, కమలాపురం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పుత్తా నరసింహారెడ్డి ఆస్పత్రికి వచ్చి మృతదేహాలకు నివాళుర్పించారు. కుటుంబ సభ్యులు ఓదార్చారు. ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో చెన్నూరు బెస్తకాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భావనపాడుకు మూలపేట పోర్టుగా నామకరణం

- 19న ముఖ్యమంత్రి భూమి పూజ

ప్రజాశక్తి - నౌపడ (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం సంతబొమ్మాళి మండలం భావనపాడు పోర్టును మూలపేట పోర్టుగా పేరు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. పేరు మార్పు చేయాలని కలెక్టర్‌కు సూచిస్తూ రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక వసతుల (పోర్టులు) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల్ వలవన్ జిఒ నంబరు 545 జారీ చేశారు. మూలపేట, విష్ణుచక్రం గ్రామాల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు ఉండనున్న నేపథ్యంలో భావనపాడు పోర్టును మూలపేట పోర్టుగా మారుస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెల 19న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి భూమి పూజ చేస్తారని కరికాల్ వలవన్ తెలిపారు. భూసేకరణ నిమిత్తం నిర్వహించిన జిల్లా స్థాయి చర్చల కమిటీ సమావేశంలో పోర్టు నిర్మాణం భావనపాడు గ్రామం పరిధిలోకి రానందున మూలపేట, విష్ణుచక్రం గ్రామాల రైతులు భావనపాడు పోర్టుకు బదులు మూలపేట పోర్టుగా నామకరణం చేయాలని కలెక్టర్‌ను కోరారు. మరోవైపు 70 డిమాండ్లతో గ్రామంలో కటౌట్ ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధానంగా మూలపేట పోర్టుగా నామకరణం చేయాలని కోరారు. పోర్టు నిర్మాణ ప్రాంతంలోని భూములు, నిర్వాసిత కుటుంబాలన్నీ మూలపేట, విష్ణుచక్రం గ్రామాల పరిధిలో ఉన్నందున గ్రామస్తుల కోరిక మేరకు భావనపాడు పోర్టు పేరును మూలపేట పోర్టుగా మార్చాలని కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. స్పందించిన ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. పేరు మార్పుపై మూలపేట సర్పంచ్ జీరు బాబూరావు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బిజెపి రాష్ట్ర నేతలకు చిత్తశుద్ధి ఉంటే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని బిజెపి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీ వెళ్లి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ప్రక్రియను ఆపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ విషయంలో కపట నాటకాలు ఇకనైనా కట్టిపెట్టాలని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టీల్ ప్లాంట్ అమ్మకంపై కేంద్ర బిజెపి ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇటీవల విశాఖపట్నం వచ్చిన కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి ప్రైవేటీకరణను తాత్కాలికంగా నిలిపేశామని ఉదయం, మరలా ప్రైవేటీకరణ కొనసాగుతుందని సాయంత్రం చెప్పారని తెలిపారు. ఆడలేక మద్దెల వోడు అన్నట్లు తెలంగాణా ప్రభుత్వంపై బిజెపి రాష్ట్ర నాయకులు విరుచుకుపడుతున్నారని విమర్శించారు. కేంద్రంతో మాట్లాడడం చేతకాకే ఉక్కు ఫ్యాక్టరీకి ఈ గతి పట్టిందని విమర్శించారు. రాష్ట్ర బిజెపికి చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీ నాయకత్వం యావత్తూ కేంద్రప్రభుత్వం దగ్గరకు వెళ్లి ప్రైవేటీకరణను ఆపించాలని డిమాండ్ చేశారు.

హిజ్రాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- వైసిపి వికలాంగుల విభాగం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హిజ్రాల సంక్షేమం, సామాజిక సాధికారత సాధించేలా ట్రాన్స్‌జెండర్ పాలసీని తీసుకువచ్చిందని వైసిపి వికలాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి సాధికారత సాధించేలా త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు జారీచేయనుందని తెలిపారు. ఇప్పటికే హిజ్రాలకు నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. ట్రాన్స్‌జెండర్లకు సరైన విద్య, వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ట్రాన్స్‌జెండర్లు నివసించే ప్రాంతాల్లో మంచినీటి సరఫరా, పారిశుధ్య సదుపాయాలు లాంటి మౌలికసదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

భామినిలో ఏనుగుల సంచారం

- వరి, జీడి, మామిడి తోటలు ధ్వంసం

ప్రజాశక్తి -భామిని (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలోని పకుడిభద్ర మెట్ట వద్ద ఆరు ఏనుగులు తిష్ట వేయడంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మనుమకొండ, కాట్రగాఢ -బి, నేరడి, బొమ్మిక, కొత్తూరుగూడ సమీపంలో ఏనుగులు సంచరిస్తూ, వరి, జీడి, మామిడి, నిల్వ చేసిన ధాన్యం కుప్పలను ధ్వంసం చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి కాట్రగాఢ -బిలోని ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం అనే రైతు మామిడి తోటలు, పలువురి రైతుల వరి పొలాలు, మోటర్లు, స్పింకర్లను ధ్వంసం చేశాయి. అటవీశాఖ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో ఏనుగులను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని, పంట నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

- యువగళం యాత్రలో లోకేష్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ హామీనిచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండలం రాంపురం క్రాస్ నుంచి ప్రారంభమైంది. యాత్ర మారెళ్ల మీదుగా ఎంకె.కొట్టాల వద్ద ఆలూరు నియోజకవర్గంలోకి చేరుకుంది. తుగ్గలి మండలంలో యువత, మహిళలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి రాగానే మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మారెళ్లలో బిసి తరగతుల ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. ఎవరి పాలనలో బిసిలకు న్యాయం జరిగిందో చర్చకు తాను సిద్ధమని, బిసి సంక్షేమ శాఖ మంత్రి సిద్ధమా..? అంటూ సవాల్ విసిరారు. జగన్ పాలనలో 26 వేల మంది బిసిలపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వారి భద్రత కోసం ప్రత్యేక బిసి రక్షణ చట్టం తీసుకొస్తామని, న్యాయ పోరాటానికి అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. బిసిల్లో ఉన్న ఉప కులాల వారీగా ధామాషా ప్రకారం నిధులు కేటాయిస్తామని తెలిపారు. తన సొంత మద్యం అమ్ముకోవడానికి కల్లు గీత కార్మికులను జగన్ ఇబ్బంది పెడుతున్నారని, కల్లు గీత కార్మికులను తాము ఆదుకుంటామని చెప్పారు. విదేశీ విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కేంద్రంతో సంప్రదింపులు చేసి సత్యపాల్ కమిటీ సిఫార్సుల మేరకు బోయ, వాల్మీకిలను ఎస్‌టిల్లో చేర్చే ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. యాత్ర ఎంకె.కొట్టాల గ్రామానికి చేరుకుంది. సోమవారం ఎంకె కొట్టాల నుంచియాత్ర ప్రారంభం కానుంది.



పత్తికొండ నియోజకవర్గంలో మహిళల సమస్యలను తెలుసుకుంటున్న లోకేష్

రాజకీయ ప్రత్యర్థులపై ఇడి, సిబిఐ దాడులు

పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజకీయ ప్రత్యర్థులను నియంత్రించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ఇడి, సిబిఐ వంటి సంస్థల ద్వారా దాడులు చేయిస్తున్నారని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు విమర్శించారు. ఈ నెల 24న విజయవాడలో జరగనున్న జై భారత్ సత్యాగ్రహ సభ పోస్టర్‌ను గుంటూరులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ రాహుల్ గాంధీ వంటి స్థాయి నేతలను ఇడి సంస్థలతో నియంత్రించడం ద్వారా పార్టీ కేడర్‌ను నిర్వీర్యం చేయాలన్న ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల పాత్ర కీలకమని, కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు ఈ తరహాలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని తెలిపారు. సాధారణ కేసులో రాహుల్ గాంధీకి అనర్హత వేటు వేయడం ద్వారా పార్లమెంటులో ప్రతిపక్షాలను కట్టడి చేయాలనే కుట్ర దాగి ఉందన్నారు. తొలుత జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు రాజకీయాల్లోకి వచ్చి 50 ఏళ్లయిన సందర్భంగా జరిగిన అభినందన సభలో రుద్రరాజు మాట్లాడారు. దేశంలో విలువలతో కూడిన రాజకీయాలు పతనమవుతున్నాయని, లోక్‌సభకు రూ.200 కోట్లు, అసెంబ్లీకి రూ.50 కోట్లు ఖర్చు చేసే వ్యక్తులకే ప్రధాన పార్టీలు టికెట్లు ఇచ్చే పరిస్థితి వచ్చిందని అన్నారు. డబ్బు ప్రామాణికమే తప్ప గుణగణాలు, నిజాయితీని ఎవ్వరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పిసిసి అధ్యక్షులు రుద్రరాజు తదితరులు

పిఎసిఎస్ ఉద్యోగుల ధర్నాకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రాథమిక వ్యవసాయ రుణ పరపతి సంఘం (పిఎసిఎస్) ఉద్యోగులు వివిధ సమస్యల కోసం సోమవారం నాడు చేపట్టనున్న ధర్నాకు సిఐటియు మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పిఎసిఎస్‌ల ప్రయివేటీకరణ ఆపాలని, రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌భికె) పిఎసిఎస్‌లో విలీనం చేయరాదని పిఎసిఎస్ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే 2019లో జారీ చేసిన ఉద్యోగుల వేతన సవరణ జీఓను అమల్జేయాలని కోరుతున్నారు. ప్రధానమైన ఈ మూడు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17న కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు పిఎసిఎస్ ఉద్యోగులు ఇదివరకే ప్రకటించిన సంగతి విదితమే. 2019లో జారీ చేసిన ఉద్యోగుల వేతన సవరణ జీఓ నెంబరు 36ను వైసిపి ప్రభుత్వం తన నాలుగేళ్ల పాలనలో అమలు చేయక పోగా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ పరపతి సహకార సంఘాలను బహుళ ప్రయోజనాల సంఘాలుగా మార్చాలన్న ఆదేశాన్ని వైసిపి ప్రభుత్వం అమలు చేసి పిఎసిఎస్‌లను ప్రైవేటు రంగం చేతిలో పెడుతోందని సిఐటియు తన ప్రకటనలో విమర్శించింది.

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్
మీ కుటుంబ బ్యాంక్, భారతదేశం అంతటా

అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచి, ఫస్ట్ ఫ్లోర్, ప్లాట్ నెం.50, శ్రీనగర్ కాలనీ, రోడ్డు నెం.3, బంజారాహిల్స్, హైదరాబాద్-500073.

ఫోన్ : 040-23755686/23745686
ఇ-మెయిల్ : hyd.arm@ktkbank.com
వెబ్‌సైట్ : www.karnatakabank.com
CIN : L85110KA1924PLC001128

స్థిరాస్తుల యొక్క అమ్మకపు ప్రకటన

స్థిరాస్తులు అమ్మకానికి 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు లోని నిబంధన 8(6) అంశాలతో చదువుకొనేలా 2002 నాటి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం క్రింద ఇవ్వబడిన ఇ-వేలం అమ్మకం ప్రకటన, రుణదాతకు మార్టిగేజీ చేసిన / చార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ అధీకృత అధికారిచే 03.11.2022 తేదీన నిర్మాణాత్మక స్వాధీనం చేసుకోబడిందని, సదరు ఆస్తులను రుణదాతచే "ఎక్కడ ఉన్నది అక్కడే" "ఉన్నది ఉన్నట్లే" మరియు "యదాతథం" ప్రాతిపదికపై తేది.17.05.2023 అమ్మకానికి తెలిపిన తేదీన విక్రయించబడునని ఋణగ్రహీతలు / హామీదారులు / సహపూచీదారులు: (1) M/s.సుయతి ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున డైరెక్టర్స్: i) శ్రీమతి వైదేహి తేలపోలు (డైరెక్టర్), ii) శ్రీ పవన్ చరిత్ అఖిల్ తేలపోలు (డైరెక్టర్), చిరునామా: నెం.6-3-688/10/23, 2వ అంతస్తు, దుర్గానగర్ కాలనీ, పంజాగుట్ట, హైదరాబాద్-500082, తెలంగాణ. ఇక్కడకూడా: ఫ్లాట్ నెం. 302, MCH నెం.8-3-977/2, క్రియేటీవ్ సదన్, యల్లారెడ్డిగూడ, హైదరాబాద్-500073, తెలంగాణ. (2) శ్రీమతి వైదేహి తేలపోలు, భర్త: శ్రీ తేలపోలు రామ్‌ప్రసాద్, డైరెక్టర్: M/s.సుయతి ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్. (3) శ్రీ పవన్ చరిత్ అఖిల్ తేలపోలు, తండ్రి: శ్రీ తేలపోలు రామ్‌ప్రసాద్, డైరెక్టర్: M/s.సుయతి ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్. (4) శ్రీ తేలపోలు నిహార్, తండ్రి: శ్రీ తేలపోలు రామ్‌ప్రసాద్. నెం.2, నెం.3 & నెం.4 యొక్క చిరునామా: నెం. 76-8-2-2, మానవమందిర్ రోడ్డు, భవానీపురం, కామకోటినగర్, విజయవాడ-520012, ఆంధ్రప్రదేశ్. (5) శ్రీ దావల మధుసూధనరావు, తండ్రి: దావల రామ సోమయాజులు, చిరునామా: నెం.36-99-37/5, కంచరపాలెం, విశాఖపట్నం-530008, ఆంధ్రప్రదేశ్ నుంచి రుణదాత కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, హైదరాబాద్ రాజ్‌భవన్ రోడ్డు బ్రాంచి, [ఫోన్: 040-23300548(G) / 040-23320642(BM) / 9849998635(BM) / 9676411180(ABM)] కు బకాయిపడిన మొత్తం అగు రూ.14,86,81,844.91/- (అక్షరాల పద్నాలుగు కోట్ల ఎనభైఆరు లక్షల ఎనభై ఒక్క వేల ఎనిమిది వందల నలభై నాలుగు రూపాయలు మరియు తొంభై ఒకటి పైసలు మాత్రమే) ఈ క్రింది విధముగా తెలుపబడిన వివరముల

స్వభావం & అకౌంట్ నెం.	బకాయిసొమ్ము	వడ్డీ తేదీ నుండి
PSTL A/c No. 3347001800019201	రూ. 2,59,17,770.82	01.04.2023
PSTL A/c No.3347001800019301	రూ. 9,28,92,944.09	17.03.2023
PSTL A/c No. 3347001800019401	రూ. 54,80,095.00	17.03.2023
OD A/c No.8127000100000201	రూ. 2,43,91,035.00	01.04.2023
మొత్తం	రూ. 14,86,81,844.91	

మరియు ఖర్చులు మొ॥ వాటితో సహా గల మొత్తాన్ని వసూలు చేయుటకై సదరు ఆస్తులు విక్రయించ బడుచున్నవనీ సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రస్తుడు(లు) మరియు గ్యారంటీదారుడు(లు) లకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

స్థిరాస్తుల వివరములు

ఐటమ్ నెం.3: ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, విజయవాడ ఈస్ట్, గన్నవరం యస్ఆర్ఓ, ఉంగుటూరు మండలం, అట్‌కూరు గ్రామము, ఆర్.యస్.నెం.663/1, డోర్ నెం.2-53 నందు శ్రీ దావల మధుసూధనరావుకు చెందిన 1157.50 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఆస్తి మరియు అందులో నిర్మించిన భవనమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: పంచాయతీ రోడ్డు; దక్షిణం: మాదల సురేష్ యొక్క సరిహద్దు గోడ; పడమర: ఈ ఆస్తికి మరియు కడియాల సుబ్బారావు యొక్క ఆస్తికి మధ్యలోని ఉమ్మడి సరిహద్దు గోడ; ఉత్తరం: మాల్పూరు జామియా యొక్క స్థలము.

రిజర్వ్‌ధర: రూ.51,45,000.00 (అక్షరాల యాభై ఒక్క లక్షల నలభై ఐదు వేల రూపాయలు) (టిడియస్ కలుపుకొని)
చెల్లించవలసిన బయానా: రూ.5,14,500.00 (అక్షరాల ఐదు లక్షల పద్నాలుగు వేల ఐదు వందల రూపాయలు)

ఐటమ్ నెం.4: కృష్ణా జిల్లా, విజయవాడ ఈస్ట్, గన్నవరం, తోటపల్లి గ్రామము & పంచాయతీ, సమీప డి.నెం.5-73, ఆర్.యస్.నెం. 52/2A, 52/2B నందు శ్రీ తేలపోలు రామ్‌ప్రసాద్ (చనిపోయినన్పటినుండి) తరపున చట్టబద్ధవారసులు 1) శ్రీ పవన్ చరిత అఖిల్ తేలపోలు, 2) శ్రీమతి వైదేహి తేలపోలు మరియు 3) శ్రీ తేలపోలు నిహార్ కు చెందిన 10 ఎకరాల 33 సెంట్ల రెసిడెన్షియల్ ఆస్తికి సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: రోడ్డు; దక్షిణం: రోడ్డు; పడమర: మొక్కపాటి నిర్మలకుమారి మొ॥ యొక్క స్థలము; ఉత్తరం: యన్.లక్ష్మికుమారికి అమ్మిన స్థలము మొ॥.

రిజర్వ్‌ధర: రూ.2,92,14,000/- (అక్షరాల రెండు కోట్ల తొంభై రెండు లక్షల పద్నాలుగు వేల రూపాయలు) (టిడియస్ కలుపుకొని)
చెల్లించవలసిన బయానా: రూ.29,21,400/- (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల ఇరవై ఒక్క వేల నాలుగు వందల రూపాయలు)

ఐటమ్ నెం.5: కృష్ణా జిల్లా, విజయవాడ ఈస్ట్, గుణదల గ్రామం, న్యూ అసెస్‌మెంట్ నెం. 1073220830, పాత అసెస్‌మెంట్ నెం. 42061C/VLT, డి.నెం. 54-20/6-9/3 ప్రక్కన, సమీప డి.నెం.54-20/6-9, రీ సర్వే నెం.450 నందు శ్రీ తేలపోలు రామ్‌ప్రసాద్ (చనిపోయినన్పటినుండి) తరపున చట్టబద్ధవారసులు 1) శ్రీ పవన్ చరిత అఖిల్ తేలపోలు, 2) శ్రీమతి వైదేహి తేలపోలు మరియు 3) శ్రీ తేలపోలు నిహార్ కు చెందిన 343.50 చ॥గ॥ (అప్రూవ్డ్ ప్లాన్ ప్రకారము 331.58 చ॥గ॥) విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఆస్తికి సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: దూసరి కల్పన యొక్క ఆస్తి; దక్షిణం: 33 అ॥ వెడల్పుగల మునిసిపల్ రోడ్డు; పడమర: యమ్.నారాయణమూర్తి యొక్క ఆస్తి; ఉత్తరం: కొమ్మా విట్టల్‌కుమార్ యొక్క ఆస్తి.

రిజర్వ్‌ధర: రూ.1,80,41,000.00 (అక్షరాల ఒక కోటి ఎనభై లక్షల నలభై ఒక్క వేల రూపాయలు) (టిడియస్ కలుపుకొని)
చెల్లించవలసిన బయానా: రూ.18,04,100.00 (అక్షరాల పద్దెనిమిది లక్షల నాలుగు వేల ఒక వంద రూపాయలు)

ఐటమ్ నెం.6: విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, పటమట, యల్‌పి నెం.117/77, ఆచార్య రంగానగర్, కె.జె.గుప్త మునిసిపల్ ఎంప్లాయిస్ కాలనీ, 3వ రోడ్డు, సమీప ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్ దగ్గర, ఆర్.యస్.నెం.23&24, సమీప డి.నెం.40-9/12-6 నందు శ్రీమతి వైదేహి తేలపోలుకు చెందిన 266.67 చ॥గ॥ విస్తీర్ణముగల ప్లాట్ నెం.82 రెసిడెన్షియల్ ఆస్తికి సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: కె.ఎ.యన్.మూర్తి యొక్క ప్లాట్ నెం.83; దక్షిణం: మునిసిపల్ రోడ్డు; పడమర: యమ్.వి.బసవయ్య యొక్క ప్లాట్ నెం.81; ఉత్తరం: ఎ.కళ్యాణరావు యొక్క ప్లాట్ నెం.75.

రిజర్వ్‌ధర: రూ.1,83,15,000.00 (అక్షరాల ఒక కోటి ఎనభైమూడు లక్షల పదిహేను వేల రూపాయలు) (టిడియస్ కలుపుకొని)
చెల్లించవలసిన బయానా: రూ.18,31,500.00/- (అక్షరాల పద్దెనిమిది లక్షల ముప్పై ఒక్క వేల ఐదు వందల రూపాయలు)

(సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు / తనఖాదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.) (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ (8) సబ్ రూల్ (6) క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించబడుతుంది) అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కర్ణాటక బ్యాంక్ యొక్క వెబ్‌సైట్ అనగా www.karnatakabank.com లో "mortgaged assets for sale" హెడ్ క్రింద సందర్శించండి.

ఇ-వేలము 17.05.2023 తేదీన ఉ॥ 11.00 గం॥ నుండి ఉ॥ గం॥ 11.20 ని॥ల వరకు https://bankauctions.in/ పోర్టల్ ద్వారా 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో నిర్వహించబడును.

ఉద్దేశించిన బిడ్డర్ తమ పేరును https://bankauctions.in/ నందు నమోదు చేసుకొని, యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందండి మరియు ఇ-వేలంపై శిక్షణను (తాత్కాలికంగా 16.05.2023న) ఆన్‌లైన్ ద్వారా M/s.4closure, 605ఎ, HMDA మైత్రీవనం, అమీర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ-500038, సంప్రదించవలసిన నెం: 040-23836405, mobile 8142000061/66, Email: subbarao@bankauctions.in and info@bankauctions.in నుండి పొందవచ్చును.

తేది: 13-04-2023, ప్రదేశం: హైదరాబాద్ | సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్



" వెనక చూసిన కార్యమేమోయ్?
మంచి గతమున కొంచమేనోయ్
మందగించక ముందుకడుగేయ్
వెనకబడితే వెనకెనోయ్!"
- గురజాడ



మేము నిలబడగలం!

అవునులే
నేటి విద్యార్థుల్ని
రేపటి పౌరులుగా నిలబెట్టే వాళ్లం కదా
కూర్చునేందుకు మాకు కుర్చీలెందుకులే
రకరకాల పేర్లతో నెల నెలా
ఎంతో కొంత మా పచ్చదనాన్ని
లాగేసుకుంటూనే వున్నారు
ఒక పక్క ఒరిగి సగం విరిగిన కుర్చీలని
లాగేసుకోవటం మీకో లెక్కా..!?

అయినా
నిలబడి పాఠాలు చెప్పటంలో
మా తరువాతే ఎవరైనా
ఒక జాతిని నిలబెట్టేవాళ్లం కదా
ఒక పౌరసమాజాన్ని ప్రతిష్టించేవాళ్లం
ఎప్పుడు కూర్చోవాలో ఎప్పుడు నిలబడాలో
మీకంటే మాకే బాగా తెలుసు
నరాలు తెగేలా బోధించీ బోధించీ
కడుపులో పేగులు కదిలేలా అరిచీ అరిచీ
అదీ ఏ రాతపూతల కోసమో
అలసిసిన దేహాన్ని కాసేపు అలా కుర్చీలో కుదేస్తాం
మీలెక్క మేమేమీ కుర్చీల కోసం
కుస్తీలు పట్టేవాళ్లం కాదులెండి
కుర్చీని బల్లిలా అంటి పెట్టుకుని
ఐదేళ్ల దాకా ససేమిరా దిగిపోమని
మొరాయించెటోళ్లం కాదులెండి!


అయినా మీ కళ్లకు
పనీపాటా మానేసి
కునికిపాట్లు పడే కుర్చీలు కనిపించవు
చేయాల్సిన ప్రజల పనుల్ని వాయిదా వేసి
నిద్రబల్లలుగా మారిన కుర్చీలు కనబడవు
ఉన్నఫళంగా ఎటూ కదలకుండా
ఏళ్ల తరబడి పదవిలో జోగాడే కుర్చీలు కనబడవు
ప్రజల పట్ల బాధ్యత మరిచి
కుర్చీల కోసమే కుమ్ములాడుకునే
వ్యవస్థా కనబడదు

కూర్చున్నా నిలబడ్డా
నిలువునా మంచులా కరిగినా
నిప్పులా తగలబడినా
ఒక దేశాన్ని నిర్మించి నిలబెట్టే
బోధించే జాతి మాది
మా కుర్చీలే కనిపిస్తాయి మీకు

అయినా
మా ఒంట్లో రక్తాన్నీ నరాల్నీ
లాగేసుకుంటున్నవాళ్లకు
మా ముడ్డి కింద కుర్చీలని
లాగేసుకోవటం ఒక లెక్కా
ఒక జాతినీ ఒక నీతినీ
ఒక దేశాన్నే నిలబెట్టేవాళ్లం
మేము నిబడలేమా
అయ్యా మా కుర్చీలు లాగటానికి ముందు
ప్రజల సంక్షేమాన్ని మరిచి గురకపెట్టే
మీ కుర్చీల గురించి కాస్త ఆలోచించండి!
(టీచర్లకు కుర్చీలు తీసెయ్యాలన్న ఇటీవలి ఒక వార్త చూశాక)

– చిత్తలూరి – కవిత్వం
91338 32246

'కాళికాంబ సప్తశతి'.. సమాజ శ్రేయస్సు



సమీక్ష

తెలుగు సాహిత్యంలో వచ్చిన శతక ప్రక్రియ మానవ సమాజాన్ని ఎంతో చైతన్యవంతం చేస్తుందనుటలో ఏ మాత్రం సందేహం లేదు. సాహిత్యంలో తాత్వికాంశాలను జోడించి ఉమానాలుగా అనేకాంశాలను ఉదహరిస్తూ శతక కవులు సులభంగా చిన్న చిన్న పదాలతో పద్యాలను రాశారు. కాలజ్ఞానిగా గుర్తింపుని సొంతం చేసుకున్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి 'కాలికాంబ హంస కాళికాంబ' మకుటనియమంతో అనేక పద్యాలను రచించారు. కాళికాంబ శప్తశతిలో 701 పద్యాలు మానవ సమాజ వికాసానికి ఎంతో తోడ్పడగలవు.

సమాజంలో వేదాలను స్త్రీలు, వెనుకబడిన జాతులు చదవకూడదనే ఆచారం వుండేది. దీన్ని వీరబ్రహ్మంగారు పూర్తిగా నిరసించారు.

"వెలదులకును వేదవిద్యాదికారమ్ము
లేదటంచు బ్రహ్మ లిఖిత మంచు
నోరుతెఅచి మఱచినారు వాణిని నిన్ను
కాళికాంబ! హంస! కాళికాంబ!" పుట: 678.

చదువు నేర్చిన వారికి ('వాణి') చదువుల తల్లి కటాక్షమే వుందంటారు. చదువు నెరిగిన వారు స్త్రీలను మరచిపోవడం జరుగుతుందని, వేదాలు బ్రహ్మచే రాయబడినవని చెప్పడాన్ని వీరబ్రహ్మంద్రేస్వామి నిరసించారు. వేదాలను అందరు చదవాలని, అందులోని వాస్తవికాంశాలను అందరు తెలుసుకుంటే సమాజం చైతన్యవంతంగా ముందుకు పయనిస్తుందని ఆవేదన చెందారు.

మతం మనుషుల మధ్య బేధాలను సృష్టిస్తుంది. దీనివల్ల మనిషిని మనిషే చంపుకుంటున్న తీరుని నిరసించారు. ఇది మతం కాదు 'మత్తు' మనిషికున్న విచక్షణాజ్ఞానాన్ని కోల్పోతున్న విధానాన్ని బ్రహ్మంగారు నిరసించారు.

మతము మత్తు గూర్చు మార్గమ్ము కారాదు
హితము గూర్పవలయు నెల్లరకును
హితము గూర్పలేని మతము మానగవలె పద్యం: 694.

'మత్తు'లో వున్నవారు కుటుంబసభ్యులను, తమ యోగక్షేమాలను చూసిన వారిని హింసించి చంపడం చూస్తుంటాం. దాన్ని బ్రహ్మంగారు నిరసించారు. మత్తు కలిగించే మతము వద్దు హితాన్ని బోధించేదేదన్నా వుంటే అదే మతం కావాలని, సమాజశ్రేయస్సు ప్రధానమనంటారు.

కులమతాల జాడ్యములలోన దపియించు
దీనజనుల సేద దేర్చువాడ
మానవుండె ధరను మాధవుండనువాడ (పుట: 700

దేవుడిగా పూజింపబడాలంటే కులమతాలను వదిలి దీనులైన జనుల క్షేమాన్ని కాంక్షించేవారే దైవంగా పూజింపబడతారనంటారు. ప్రజల క్షేమమే మన మతం కావాలనంటారు.

మనుషులు ఒకరోజు మరణించక తప్పదు. అల్పప్రాణులు పుడుతుంటాయి. గిట్టుతుంటాయి. వాటి ప్రాణానికి విలువలేదు. మాయలో పుట్టి మొత్తం నాదేనంటూ స్వార్థంతో అత్యంత ధనవంతునిగా జీవించేవారు తెలుసుకోవాల్సిన గొప్ప విషయాన్ని తెలియజేశారు.

విశ్వమంత మాయ వేడుకలను మాయ
నేను, మేను మాయ నీవు మాయ
మాయలోన బుట్టి మలయు సమస్తంబు పుట: 97.

ఎన్నో తరాలు మట్టిలో కలసిపోయాయి. వారంతా వెంట ఏదీ తీసుకుపోలేదన్న విషయాన్ని గుర్తించాలని స్నేహశీలంగా జీవించాలనంటారు.

దళిత బహుజన జాతులు స్వయంగా పనులు చేసి ఈ దేశాన్ని అభివృద్ధి చేస్తుంటారు. శ్రామికులుగా, పాలేర్లుగా పనులు చేస్తుంటారు. వీరు చేసే పనిని బట్టి 'కులము'ను నిర్ధారించారు. కులం పేరుతో తక్కువ చేసి మాట్లాడటం మంచిది కాదనంటారు. శూద్రులను తక్కువ చేసి చూడటాన్ని నిరసించిన వీరబ్రహ్మంగారు శూద్రులే ఈ సృష్టిలో ముందున్నదంటారు. అందుకు నిదర్శనంగా వేదాలను అధ్యయనం చేసి తెలుసుకోండని పిలుపినిచ్చారు.

"ఇలకు దిగెడువేళ కులమెవ్వరికి లేదు
మొదలు శూద్రుడుగను పుట్టువందు
శ్రుతులు చదువు వెనుక శూద్రుండె విప్రుడౌ"
పుట: 116.

విప్రులని ఎవరినైతే అంటున్నామో వారు ఒకప్పటి శూద్రుడేనంటూ పుట్టుకతో కులము ముసుగేసుకొని పుట్టరని మనుషుల మధ్య బేధభావన పోవాలని కులాన్ని నిరసించారు.

విద్య మనిషిని మనిషిగా గుర్తుస్తుంది. విద్య విజ్ఞత నేర్పుతుంది. సమాజాన్ని బలపరుస్తుంది. మనిషిని వివేకవంతుడిగా ముందుకు నడిపిస్తుంది. అనేకరకాలైన విద్యలు నేర్చినవారు మూర్ఖత కలిగివుంటే ఆ చదువుకి ఫలితం లేదనంటారు.

"చదివి చదివి ముదిమిగదిసి మూర్ఖతరేగ
చదువు మర్మ మెఱుగు జాడ గనరు
నేర్పు లేని చదువు నిష్ప్రయోజనమౌను" పుట: 145.

'నేర్పు' మనిషి జీవించగలిగేలా చేసేది విద్య అటువంటి విద్యకు ఫలితం సమాజశ్రేయస్సు అని అంటారు.

కోటి విద్యలు కూటికొరకు. అన్నం ప్రతి కులపువానికి కావాలి, ప్రతి మతం వానికి కావాలి. సృష్టిలో ప్రతి జీవికి బ్రతకడానికి ఆహారం కావాలన్నది ప్రధానం. ఇక్కడ మనకి అన్నం కావాలి. ఈ అన్నం కోసమే కదా మనిషి తన చుట్టు ఏర్పరచుకున్న కంచెలకు కారణమంటారు. మనుషులందరు అన్నదమ్ములవలె కలసిమెలసి వుంటే ఘర్షణలండవ నంటారు.

"కూటి వలన నేరుపాటయ్యె ప్రాణులు
కూడులేక వేఱు కులము లేదు
కూటిమర్మమెఱుగు గురుమూర్తి యొక్కడే" పు: 175.

కూడు కోసం జరిగే కొట్లాటల్లో మనిషిని మనిషి హతమార్చుకోడం తరతరాల నుండి వస్తున్న విధానం బ్రహ్మంగారి కాలం నుండి ఆధునిక కాలం వరకు కొనసాగుతూనే వుంది. మార్పు రావాల్సిన అవసరం వుంది.

'మరణం' చాల విచారకరమైనది. కొంతమంది పంతంపట్టి చచ్చి సాధించాలనుకుంటారు. చనిపోతే సాధించేది వుండదని వారి జీవితం అంతమైనట్టే అవుతుందని బ్రతికి సాధించుకోవాలని ధైర్యాన్ని నింపుతారు.

"చచ్చి యెవరినైన సాధింపగా లేము
చాక బాధకముల సాధకముల
సమయజేసి పరము సాధించు కొనరయా
కాళికాంబ! హంస! కాళికాంబ!

మనిషి పుట్టిన తరువాత చేయవలసిన మంచి పనులు చేసి, తమకున్న స్థానాన్ని గుర్తించుకోవాల్సిన అవసరం వుందనంటారు. వీరబ్రహ్మంగారు ఈ శతకంలో సమాజ శ్రేయస్సుని కాంక్షించి అనేక సోదాహరణలతో సులభగ్రాహ్యంగా పద్యాలను రచించారు. మంచి మనిషి మంచి సమాజాన్ని నిర్మించగలిగినట్లైతే అసమానతలు తొలగి లభించే వనరులను అందరు పంచుకొని జీవించగలుగుతారు.

– డాక్టర్ జి.శైలమ్మ
96183 61095

ఎవరు పిచ్చోళ్లు?

ఎలా ఉన్నావని అడుగుతారు

అప్పుడు నేను –
తలను ఊపే మొక్కనవుతాను
పూల చెట్టునవుతాను
విశిష్ట ఫలాన్నవుతాను
మౌనపు మాటనవుతాను
పెదవిని తుంచేసే విరుపునవుతాను
మార్మిక చూపునవుతాను
విరాగి నవ్వునవుతాను

వాళ్ళే మళ్ళీ ఏం చేస్తున్నావని అంటారు!

అప్పుడు ఇలా చెబుతాను :
చిత్తు కాగితాలు ఏరుకుని సాఫీ చేస్తాననీ
రాలిన ఆకులకి కథలు చెబుతాననీ
దొరికిన పక్షి ఈకలతో రెక్కలను
ఊహిస్తాననీ
ఋతువులకి సమాధానమవుతాననీ
కాలానికి సరిపడా ఊయల చేస్తాననీ
మీరు చూడలేనిదంతా రాసేసి
నవ్వుకుంటాననీ ....

???
అప్పుడే పేవ్మెంట్‌పై ఒకమ్మాయి
దేవకన్యలా నడుచుకుంటూ
మార్మికంగా నవ్వుకుంటూ
సర్వ సృష్టినీ తన పాదాల వెంట
వేసుకుని వెళ్ళిపోతుంది.

వరిక్కడ పిచ్చివాళ్ళు?

– అనూరాధ బండి

విముక్తి కోసం ...

శ్వేత పత్రాల్లాంటి అన్ని వ్యవస్థలను
సమూలంగా చెద పురుగుల్లా పిప్పిచేసి
భ్రష్టు పట్టించిన బలిసిన జంబూకాలను
విప్లవమనే ఇనప తొడుగు ధరించిన
పిడికిలితో ముక్కు దూలం పగిలేలా
కళ్ళు బైర్లు కమ్మేలా
పిడుగుల్లాంటి ఘాతాలు వేసి
ఏలికలకు పాఠం నేర్పాలి

ఎవడబ్బ సొమ్మని
ప్రజాధనాన్ని దర్జాగా కొల్లగొట్టి
రాజ్యమేలుతూ
సొంత కడుపులు నింపుకుంటూ
పేదల, రైతుల బొజ్జలు డొల్ల జేస్తూ
దొరల పాలనను గుర్తుకు తెస్తూ
దోపిడీ దౌర్జన్య రాక్షస నేతల
ఆగడాలను కాపు కాస్తూ ...
అమాయక జనుల గుండెలపై తంతూ
న్యాయదేవత కళ్ళకు గంతలు కట్టిన
వైనాన్ని నిజం చేస్తూ ...

నిజమైన సత్యాన్ని
కళ్ళు మూసుకున్న న్యాయ దేవత ముందే
ఉరికొయ్యకు బిగించి
ఉన్న కాస్త ఉసురు తీస్తుంటే
తాళలేక తీసే మిన్నునంటే ఆర్తనాదాల్ని
కళ్లులేని న్యాయం చెవులరా వింటూ కూడా
ఏమీ ఎరగనట్టు నిల్చొని ఉంది!

అందుకే
చెమటను నెత్తురుగా మార్చి
కష్టించి సాధించిన మన్నూ మాకులనూ
నదీమతల్లులనూ, భూమాతను
భక్షించే రాకాసి కొండచిలువలను

అసహాయ శూరులంతా వీరులై శూరులై
చీమల దండై చుట్టు ముట్టి కుట్టి కుట్టి
చర్మం ఊడేలా మట్టుబెట్టాలి
ముసుగేసుకున్న అసురులకు గుణపాఠం చెప్పాలి
న్యాయదేవత కళ్ళు విప్పుకునేలా చెయ్యాలి

అప్పుడే
తాడిత పీడిత బడుగు బతుకులకు
బానిస సంకెళ్ల నుంచి విముక్తి కలిగేది
వారి బతుకులు వడ్డించిన విస్తరి అయ్యేది!

– నాగముని.యం
9490856185



నడుస్తున్న వాక్యం..!

తనతో
పరిచయం నిన్న మొన్నటిది కాదు
కొంగుముడి నాటినుంచే
ప్రతి అడుగూ ప్రేమపాదుల దారై సాగుతున్న
అందమైన జీవన ప్రయాణం!

తనకిచ్చిందేమీ లేదుగానీ
ఆదిలోనే చదువుకు అడ్డుపడ్డ వైకల్యానికి
కొత్త అడుగులు నేర్పి ఊతమయ్యాను
పట్టుసడలని నమ్మకానికి ప్రాణంపోశాను
తనకు చేసిందేమీ లేదుగానీ
పేదరికం ఆంక్షల అడ్డుగోడలైన ప్రతిసారీ
ఆమె ముందు ఆత్మ విశ్వాసమై నిలబడ్డాను
అన్ని వేళలా భరోసా వాక్యమై వెంట నడిచాను

కన్నవాళ్ళని పోగొట్టుకుని
పుట్టెడు ధ్ఖంలో ఉంటే
కంటి చెమ్మ తుడిచి
కలిసి జీవితం పంచుకుందామనే
ధైర్య వచనమయ్యాను గానీ
తనకు తానుగా నన్నేమీ అడగలేదు

ఒద్దికైన జంటను చూసి
కాలానికి కన్ను కుట్టిందేమో
ఇద్దరికీ శాశ్వతమైన వైకల్యాన్ని అంటగట్టి
జీవితానికి సరిపడా విషాదాన్ని మిగిల్చింది

అయినా...కాలానికేం తెలుసు?
ప్రేమతో కట్టుకట్టి ఆత్మ స్థైర్యపు లేపనం పూసీ
ఇలా స్ఫూర్తి వాక్యాలమై నిలబెడతామని
తెలిసుంటే ఇంతటి గాయం చేసేది కాదేమో?

ఎన్ని గాయాలనైనా భరిస్తూ
తాను నిలబడుతూ నన్ను నిలబెడుతూ
బిడ్డల పలకలపై అక్షరాల్ని కలగంటూ
ఇంటినొక నిబ్బరవేదుకని చేసే తను..

నాతో తోడుగా నడుస్తున్న వాక్యం !

– ఆది ఆంధ్ర తిప్పేస్వామి
77802 63877

బాల సాహిత్యకారుల పరిచయ సమాహారం



పుస్తకం

తెలుగు బాల సాహిత్యం అతి పురాతనమైనది. తల్లీబిడ్డా ఎప్పటినుంచి ఉన్నారో అప్పటి నుంచీ బాలసాహిత్యం ఉంది. బిడ్డ పుట్టిన కొన్ని రోజులకే నిద్ర పుచ్చడానికి అమ్మ పాడే జోల పాట మొదలు, బడిలో అడుగుపెట్టే వరకు ఇంట్లో పెద్దలు చెప్పే కథలు, పాటలు, పద్యాలు, సామెతలు, సూక్తులు, జాతీయాలు వంటివన్నీ బాల సాహిత్యమే అనొచ్చు. సాహిత్యం అంటే సమాజ హితం కోరేది. బాలసాహిత్యం అంటే బాలల హితం కోరేది కనుక ఇదంతా బాల సాహిత్యమే! పిల్లలు బడికి వెళ్లడానికి ముందే అనగా అక్షర జ్ఞానం కలగకముందే వారి ఉన్నతికి ఉపయోగపడే అనేక అంశాలను ఎదుగుతున్న క్రమంలో నేర్చుకుంటారు. పిల్లల బాల్యాన్ని చక్కగా ప్రభావితం చెయ్యగలిగితే వారి భవిష్యత్తు బంగారుమయం అవుతుందనేది సత్యం. ఇంట్లో పెద్దలు, బడిలో గురువులు నేర్పించే మంచి అంశాలతో పిల్లల్లో చక్కని నడవడిక, క్రమశిక్షణ అలవడతాయి. వీరితో సమానమైన బాధ్యతను బాల సాహితీవేత్తలు నిర్వర్తిస్తుంటారు.

నాటి కాలంలో గురజాడ, కందుకూరి, నార్ల చిరంజీవి, వేటూరి కామేశ్వరరావు, న్యాయపతి రాఘవరావు, బి.వి. నరసింహారావు మున్నగువారు పిల్లల మేలుకోరి ఎన్నో మంచి రచనలను అందించారు. తదుపరి కాలంలో కవిరావు, వేజెండ్ల సాంబశివరావు, రెడ్డి రాఘవయ్య, వెలగా వెంకటప్పయ్య, అలపర్తి వెంకట సుబ్బారావు, సమతా రావు మొదలైనవారు తమ రచనలతో పిల్లల ఉల్లములను కొల్లగొట్టారు. తరువాతి కాలంలో కూడా అనేకమంది బాలసాహితీవేత్తలు బాలల శ్రేయస్సు కోసం చక్కని రచనలను రచించి పుస్తక రూపంలో విడుదల చేసి తెలుగు లోగిళ్ళలో బాల సాహిత్య విస్తారానికి తోడ్పడ్డారు. అలాంటి బాల సాహితీవేత్తల గురించి సమాచారం సేకరించి ఒకచోట గుదిగుచ్చితే ఇతర రచయితలకు, పరిశోధక విద్యార్థులకు, బాల సాహిత్య ప్రేమికులకు మేలు కలుగుతుందని భావించి ఆ బాధ్యతను భుజస్కంధాల మీద వేసుకొని విజయ తీరాలకు చేర్చిన బాల సాహితీవేత్త పైడిమర్రి రామకృష్ణ.

ఎక్కడెక్కడో ఉన్న బాలసాహిత్య రచయితల పరిచయాలను శ్రమతో సేకరించి, బాలసాహితీశిల్పులు పేరుతో చక్కని పుస్తకంగా తీసుకురావడం అభినందించదగ్గ విషయం.

పైడిమర్రి రామకృష్ణ పుట్టింది తెలంగాణ గడ్డ మీదనే అయినప్పటికీ తరతమబేధం పాటించరు. ఆంధ్రుడా, తెలంగాణేతరుడా, మరో రాష్ట్రానికి చెందిన వాడా అనేది పట్టించుకోరు. బాలసాహిత్యానికి కృషి చేస్తున్న వారందరినీ సమానంగా గౌరవిస్తారు. అందరి రచనలను ప్రోత్సహిస్తారు. అందుకే ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా నెరవేర్చగలిగారు. స్వయంగా చక్కని బాలసాహితీ వేత్త అయిన పైడిమర్రి రామకృష్ణ, చక్కటి శైలిలో, సులభమైన పదాలతో అరటిపండు వలిచి పిల్లల నోటికి అందించినంత తేలికగా కథలు రాసి మెప్పిస్తారు. ఆయన రాసిన మామయ్య డాట్ కామ్, గుడ్డెలుగు బల్లం మొదలైన ఆరు కథా సంపుటాలు పాఠకుల మెప్పు పొందాయి. అలాంటి రచయిత కాబట్టే బాల సాహిత్య కారుల ప్రయోజనం ఆశించి సూర్య దినపత్రికలో 'బాల సాహితీశిల్పులు' పేరుతో రాసిన వ్యాసాలను, ఆంధ్రప్రభ బాలప్రభలో చేసిన పరిచయాలను నేడు పుస్తక రూపంలో తెచ్చారు. వందలాది కథలు రాసిన చాలామంది బాలల రచయితలు అనామకంగా ఉండిపోతున్నారు. వారి వివరాలు చదువరులకు, తోటి రచయితలకు తెలియటం లేదు. ఒకరిద్దరు మాత్రమే తమని తాము ప్రమోట్ చేసుకుంటూ ఉండగా, నిజమైన బాలసాహితీవేత్తలు మాత్రం ఎటువంటి ప్రచారం ఆశించకుండా నిశ్శబ్దంగా రాసుకుంటున్నారు. ఆ లోటును గమనించిన పైడిమర్రి బాల సాహితీవేత్తల పరిచయంతో కూడిన పుస్తకాన్ని వెలువరించారు. ఆ లోటు తీర్చడానికా అన్నట్టు ఈ పుస్తకం విడుదలై బాలసాహితీవేత్తల గౌరవాన్ని పెంచింది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్.గోపి తమ ముందుమాటలో 'బంగారు మర్రి ఈ పైడిమర్రి' అని శీర్షిక పెట్టి , పైడిమర్రి రామకృష్ణ వారి ఇంటి పేరు లాగా బంగారం లాంటి విలువైన బాల రచయిత అని కూడా ప్రశంసిస్తారు. అది నిజమే అనిపిస్తుంది పైడిమర్రి గారితో పరిచయం ఉన్నవారికి.

ఈ గ్రంథంలో పాత తరం రచయితలు మొదలు ఒకటి రెండు పుస్తకాలు అచ్చువేసిన రచయితల పరిచయాల వరకు చోటు చేసుకున్నాయి. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత రావూరి భరద్వాజ, ప్రముఖ రచయిత్రి తురగా జానకీరాణి గార్ల పరిచయాలతో బాటు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందిన బాల సాహితీవేత్తలు కలువకొలను సదానంద, భూపాల్ రెడ్డి, రెడ్డి రాఘవయ్య, డి. సుజాత దేవి, డా. దాసరి వెంకటరమణ, చొక్కాపు వెంకటరమణ, అలపర్తి వెంకట సుబ్బారావు, వాసాల నరసయ్య, నారంశెట్టి ఉమామహేశ్వరరావు, బెలగాం భీమేశ్వరరావు, కన్నెగంటి అనసూయ, దేవరాజు మహారాజు, డా.పత్తిపాక మోహన్ గార్ల పరిచయాలు ఇందులో ఉన్నాయి. ఇంకా చందమామ రచయితలు వసుంధర, డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, మాచిరాజు కామేశ్వరరావు, బూర్లె నరసింహ శాస్త్రి, ఎం.వి.వి.సత్యనారాయణ, ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి, ఎం.డి.సౌజన్య, ఎన్.వి.ఆర్.సత్యనారాయణ మూర్తి, కేకే రఘునందన, కోనే నాగ వెంకట ఆంజనేయులు వంటి రచయితల పరిచయాలూ ఉన్నాయి. సంపాదకులుగా ఉంటూ బాల సాహిత్యం రాసిన కొల్లూరు స్వరాజ్యం వెంకట రమణమ్మ, డి.వి.ఆర్. భాస్కర్, కంతేటి చంద్ర ప్రతాప్ గార్ల పరిచయాలు ఇందులో చేరాయి.

మారుతున్న కాలంతో పాటు ఫోన్, వాట్సాప్, మెయిల్ వినియోగం పెరిగింది. అతి తొందరగా సమాచారాన్ని చేరవేయడానికి రచయితల పరిచయంతో పాటు వారి ఫోటో, ఫోన్ నెంబరు, మెయిల్ ఐ.డి.ల అవసరాన్ని గుర్తించిన రామకృష్ణ వాటిని కూడా సేకరించి చిరునామా కిందనే ప్రచురించారు. ఇదెంతో ప్రయోజనకరం. 101 మంది పరిచయాలను ఒకే చోట ముద్రించి అందించిన ఈ పుస్తకం బహు విలువైనది. ఈ పుస్తకంలోని రచయితల పరిచయాల్లో భాగంగా బాల సాహిత్యంలో ప్రచురించబడిన మొదటి రచన వివరాలతో బాటు, ప్రచురించిన పుస్తకాలు, పొందిన పురస్కారాలు, జన్మదినం, కుటుంబ సభ్యుల వివరాలు మొదలైన ముఖ్య సమాచారం అందించారు. ఈ పుస్తకానికి ప్రముఖ చిత్రకారుడు తుంబలి శివాజీ చక్కని ముఖచిత్రాన్ని అందించారు. ఇంత విలువైన సమాచారం కలిగిన పుస్తకాన్ని వెలువరించిన రామకృష్ణ గారికి అభినందనీయులు. ఈ పుస్తకాన్ని రచయితలు, బాలసాహితీవేత్తలు మాత్రమే కాకుండా బాల సాహిత్యమంటే అభిమానమున్న ప్రతి ఒక్కరూ కొనుక్కుని పదిలపరచుకోవాల్సిన అవసరముంది. తాము చందమామ, బాలమిత్ర, బుజ్జాయి, బొమ్మరిల్లు పత్రికల్లో చదివిన కథా రచయితల గురించి తెలుసుకుని ఆనందించవచ్చు. గ్రంథాలయాలలో భద్రపరచాల్సిన విలువైన పుస్తకమిది. పుస్తకం వెల రు.200. పేజీలు :112. కాపీలు కావాల్సిన వారు సంప్రదించాల్సిన చిరునామా : పైడిమర్రి రామకృష్ణ, ఇంటి నెంబరు 9-86/1, శ్రీ కృష్ణ టెంపుల్ పక్కన, నాదర్గుల్ - 501510, బాలాపూర్ మండల్, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, తెలంగాణ. మొబైల్ : 92475 64699.

– నారంశెట్టి ఉమామహేశ్వర రావు,
94907 99203

అట్టాడ అప్పల్నాయుడుకు చిలుకూరి దేవపుత్ర సాహిత్య పురస్కారం

ప్రతి ఏడూ అందించే చిలుకూరి దేవపుత్ర స్మారక సాహిత్య పురస్కారం, జూరీ సభ్యులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, డా.శాంతినారాయణ, బండి నారాయణస్వామి, ఆచార్య బాలసుబ్రమణ్యం గార్ల ప్రతిపాదన మేరకు, ఈ సంవత్సరం (2023) ప్రఖ్యాత రచయిత అట్టాడ అప్పల్నాయుడు గారికి ప్రకటిస్తున్నాం.ఈ నెల 24వ తేదీన అనంతపురంలో పురస్కార ప్రదాన సభ జరుగుతుంది.

– చిలుకూరి లక్ష్మీదేవపుత్ర, చిలుకూరు సాహిత్య కుటుంబం

23న డా. ఎస్వీకి హనుమారెడ్డి స్మారక పురస్కారం ప్రదానం

ప్రకాశం జిల్లా రచయితల సంఘం పూర్వ అధ్యక్షులు భీమనాథం హనుమారెడ్డి 82వ జయంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి డాక్టర్ ఎస్.వి. సత్యనారాయణకు భీమనాథం హనుమారెడ్డి స్మారక సాహిత్య పురస్కారం – 2023ను ప్రదానం చేస్తున్నట్లు ప్రరసం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు తెలిపారు. ఈ అవార్డు కింద రూ.10 వేల నగదు, ప్రత్యేక జ్ఞాపికను అందజేస్తున్నట్లు తెలిపారు. ఎస్.వి. సత్యనారాయణ గతంలో కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం పదకోశ నిర్మాణ కమిటీ సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నంది అవార్డు కమిటీ సభ్యులుగా సేవలు అందించారు. 5 కవితా సంపుటాలు, 2 అనువాద గ్రంథాలు, 28 సాహిత్య గ్రంథాలు రచించారు. 30 సాహిత్య గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. ఈ నెల 23వ తేదీన ఒంగోలులో జరిగే హనుమారెడ్డి జయంతి వేడుకల్లో డాక్టర్ ఎస్. వి. సత్యనారాయణకు ఈ అవార్డు ప్రదానం చేయనున్నారు.

మహేశ్వరయ్య స్మారక సాహిత్య పురస్కారం-2022

సాహితీస్రవంతి ఆధ్వర్యంలో ప్రతిఏటా ఇచ్చే మహేశ్వరయ్య స్మారక సాహిత్య పురస్కారం–2022కు కలుంకూరి గుట్ట కథాసంపుటి ఎంపికైంది. తెలుగు రాష్ట్రాల నుంచి 2022లో ప్రచురించిన 39 కథాసంపుటాలు పరిశీలనకు వచ్చాయి. చిత్తూరు జిల్లాకు చెందిన యువకవి, కథారచయిత కెవి మేఘనాథరెడ్డి కథల సంపుటిని న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. అవార్డు గ్రహీతకు సన్మానంతో పాటు జ్ఞాపిక రూ.ఐదు వేల నగదును ఏప్రిల్ 27న కర్నూలు టిజీవి కళాక్షేత్రంలో జరిగే మహేశ్వరయ్య ద్వితీయ వర్ధంతి సభలో అందించనున్నాం.

– కెంగార మోహన్, అధ్యక్షులు, అవార్డు కమిటీ -2022

రాఘవేంద్రకు కందికొండ రామస్వామి స్మారక పురస్కారం

నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఇచ్చే కందికొండ రామస్వామి స్మారక జాతీయ పురస్కారం ఈ ఏడాది అనంతపురం జిల్లాకు చెందిన కవి ఈ.రాఘవేంద్ర ఎంపికయ్యారు. ఆయన రచించిన 'కల్లంచుల బువ్వ' దీర్ఘ కవితకి గానూ ఈ పురస్కారం ప్రకటించినట్టు వనపట్ల సుబ్బయ వహీద్ ఖాన్ తెలిపారు. ఏప్రిల్ 16న నాగర్ కర్నూలులో పురస్కారం ప్రదానం చేశారు.

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

అతిక్ హంతకులకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

- భారీ బందోబస్తు మధ్య అతిక్ సోదరుల అంత్యక్రియలు
- న్యాయ కమిషన్ ఏర్పాటు

లక్నో : గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపి అతిక్ అహ్మద్, ఆయన సోదరుడు అష్రాఫ్‌ను అతి సమీపం నుంచి కాల్పులు జరిపి హత్య చేసిన ముగ్గురు నిందితులకు ప్రయాగ్ రాజ్ కోర్టు ఆదివారం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. శనివారం రాత్రి జర్నలిస్టుల మాదిరిగా వచ్చి హత్య చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిని లవ్లీష్ తివారీ, సన్నీ, అరుణ్ మౌర్యగా గుర్తించారు. వీరికి ప్రయాగ్ రాజ్ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించినట్లు అతిక్ అహ్మద్ తరుపు లాయర్ మనీష్ ఖన్నా ఆదివారం తెలిపారు. కాల్పుల్లో స్వల్పంగా గాయపడ్డ లవ్లీష్ ప్రస్తుతం ఇక్కడి స్వరూప్ రాణి మెడికల్ కాలేజ్‌లో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు చెప్పారు.



ఘటనపై విచారణకు అలహాబాద్ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి అరవింద్ కుమారిర్ త్రిపాఠి అధ్యక్షతన జ్యుడీషియల్ కమిషన్‌ను ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్‌లో రిటైర్డ్ న్యాయమూర్తి బ్రిజేష్ కుమార్ సోనీ, మాజీ డిజిపి సుబేష్ కుమార్ సింగ్ సభ్యులుగా ఉంటారు. రెండు నెలల్లో నివేదిక అందించాలని భావిస్తున్నట్లు కమిషన్ తెలిపింది.

ఆదివారం మధ్యాహ్నం ఐదుగురు వైద్యులతో కూడిన ప్యానెల్ అతిక్, ఆయన సోదరుడి మృతదేహాలకు స్వరూపరాణి నెహ్రూ ఆసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను వారి బంధువులకు అప్పగించాయి. ఈ నెల 13న హత్యకు గురైన అతిక్ తనయుడు అసద్ మృతదేహాన్ని శనివారం ఖననం చేసిన కసరి మసారి శ్మశాన వాటికలోనే అతిక్ సోదరుల మృతదేహాలను ఆదివారం సాయంత్రం ఖననం చేశారు.

అతిక్‌కు ఐఎస్‌ఐ, లష్కరే తోయిబాతో సంబంధాలు : ఎఫ్‌ఐఆర్‌లో పోలీసులు

అతిక్ అహ్మద్ విచారణ సమయంలో తనకు పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్‌ఐ, తీవ్రవాద సంస్థ లష్కరే తోయిబాతో సంబంధాలు ఉన్నాయని అంగీకరించినట్లు ఎఫ్‌ఐఆర్‌లో ఉత్తరప్రదేశ్ పోలీసులు పేర్కొన్నారు. ఉమేష్‌పాల్ హత్య కేసు విచారణ నిమిత్తం అతిక్, అష్రఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం అతిక్ వాంగ్మూలం నమోదు చేశారు. 'పంజాబ్‌లో డ్రోన్‌ల ద్వారా ఐఎస్‌ఐ ఆయుధాలను జారవిడిచేదని, వాటిని ఎల్‌ఇటి, ఖలిస్థాన్ వేర్పాటువాదులకు పంపేవాడిని' అని అతిక్ చెప్పినట్లు ఎఫ్‌ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉమేష్ పాల్, ఆయనకు భద్రత కల్పిస్తున్న ఇద్దరు పోలీసుల హత్యలో ఐఎస్‌ఐ, లష్కరే తోయిబా నుంచి తీసుకున్న ఆయుధాలను ఉపయోగించినట్లు అతిక్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. తన సోదరుడు అష్రాఫ్‌కు కూడా ఐఎస్‌ఐ, లష్కరే తోయిబా సభ్యులతో పరిచయాలు ఉన్నట్లు అతిక్ చెప్పినట్లు పేర్కొన్నారు.

గుర్తింపు కోసమే అతిక్ హత్య

పేరు, గుర్తింపు కోసమే అతిక్‌ను హత్య చేసినట్లు ముగ్గురు నిందితులు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. 'అతిక్, అష్రఫ్‌లను హత్య చేయడం ద్వారా రాష్ట్రంలో పేరు, గుర్తింపు తెచ్చుకోవడమే మా లక్ష్యం. దీని ద్వారా భవిష్యత్‌లో తప్పకుండా ప్రయోజనం పొందుతాం' అని నిందితులు చెప్పినట్లు పోలీసులు చెప్పారు. అతిక్‌ను హత్య చేసిన తరువాత సంఘటనా స్థలం నుంచి పారిపోవాలని అనుకోలేదని, పోలీసులు తక్షణమే చర్య తీసుకోవడమే తమకు కావాల్సిందని చెప్పినట్లు తెలిపారు.

ప్రయాగ్‌రాజ్‌లో భద్రత పెంపు

అతిక్ హత్య తరువాత ప్రయాగ్‌రాజ్‌లో పోలీసులు భద్రతను పెంచారు. 144 సెక్షన్ పెట్టారు. అతిక్ నివాసం ఉన్న చకియా ప్రాంతంతో పాటు, ఇతర ప్రాంతాల్లోనూ అధిక సంఖ్యలో పోలీసులు మోహరించారు. ఉత్తర ప్రదేశ్ వ్యాప్తంగానూ భద్రతను సమీక్షిస్తున్నారు. ప్రయాగ్ రాజ్ జిల్లావ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.

పోలీసులపై చర్యలేవి ?

- నిందితులది నేరచరిత్ర
- ప్రయాగ్‌రాజ్ ఘటనపై అనుమానాలెన్నో

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్, ఆయన సోదరుడు అష్రఫ్ అహ్మద్‌లను శనివారం రాత్రి అందరూ చూస్తుండగానే దుండగులు కాల్చి చంపిన ఘటన ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్ ప్రాంతంలో ఇంటర్నెట్ సేవలు నిలిపేశారు. టివి కెమెరాల సాక్షిగా, పోలీసు వలయం నడుమ ఈ సంఘటన జరగడం సంచలనం సృష్టించింది. దీనిని భద్రతా వైఫల్యంగా పలువురు అభివర్ణిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ లక్నోలో ఆదివారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు నివేదిక పంపారు. అయితే ఇప్పటి వరకూ పోలీసులపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఈ ఘటనకు కారకులైన లవ్లేశ్ తివారీ, సన్నీ సింగ్, అరుణ్ మౌర్యలకు నేర చరిత్ర ఉన్నదని పోలీసులు చెబుతున్నారు. అయితే వారి కుటుంబసభ్యులు మాత్రం దీనితో ఏకీభవించడం లేదు. లవ్లేశ్ తివారీ గతంలో జైలుకు కూడా వెళ్లాడు. కుమారుడితో తమకు ఎలాంటి సంబంధాలు లేవని లవ్లేశ్ తండ్రి తివారీ అంటున్నారు. 'అతను మాతో ఉండడం లేదు. ఐదారు రోజుల క్రితం వచ్చాడు. కొన్ని సంవత్సరాలుగా అతనితో మాకు మాటలు లేవు' అని ఆయన చెప్పారు. లవ్లేశ్ పనీపాటా లేకుండా తిరుగుతుంటాడని, అతను మాదకద్రవ్యాలకు బానిస అని తెలిపారు. సంఘటన సమయంలో సహ నిందితులు జరిపిన కాల్పుల్లో లవ్లేశ్ కాలిపై గాయం అయింది. దీంతో అతనికి ప్రయాగ్‌రాజ్ ఆస్పత్రిలో చికిత్స చేస్తున్నారు.

మరో నిందితుడైన సన్నీపై 14 కేసులు ఉన్నాయి. రౌడీ షీటర్ అయిన సన్నీ ప్రస్తుతం పోలీసులను తప్పించుకొని తిరుగుతున్నాడు. తండ్రి చనిపోవడంతో తనకు వచ్చిన వాటా అమ్ముకొని అతను అయిదేండ్లుగా వేరేగా ఉంటున్నాడు. 'అతను ఏ పనీ చేయడం లేదు. నేరస్తుడు ఎలా అయ్యాడో తెలీడం లేదు. ఈ ఘటన గురించి మాకేమీ తెలియదు' అని సన్నీ సోదరుడు పింటూ సింగ్ చెప్పారు.

మూడవ నిందితుడు అరుణ్ చిన్నప్పుడే ఇల్లు విడిచి వెళ్లాడు. 2010లో ఒక పోలీసును రైలులో హత్య చేసినందుకు కేసు నమోదైంది. అతను ఢిల్లీలోని ఒక ఫ్యాక్టరీలో పని చేశాడు. ఈ ముగ్గురు నిందితులూ ప్రయాగ్‌రాజ్‌లోని ఒక లాడ్జిలో ఉంటున్నారు.



మండుటెండలో నీడ ఏర్పాటు చేయకుండా జరిపిన అవార్డు ప్రదానోత్సవ సభ

మహారాష్ట్రలో దారుణం

- అమిత్ షా సభలో వడదెబ్బకు 8 మంది మృతి
- మరో 125 మంది ఆసుపత్రి పాలు
- నీడ ఏర్పాటు చేయకపోటమే కారణం

ముంబయి: మహారాష్ట్ర భూషణ్-2022 అవార్డు ప్రదానోత్సవంలో ఎండ వేడిమి భరించలేక ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 125 మంది వడదెబ్బకు గురయ్యారు. వారిని దగ్గర్లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వెల్లడించారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత సిఎం షిండే ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నవీ ముంబయిలో మహారాష్ట్ర భూషణ్-2022 అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సామాజిక కార్యకర్త దత్తాత్రేయ నారాయణ్‌కు అవార్డును ప్రదానం చేశారు. మిట్ట మధ్యాహ్నం కార్యక్రమం నిర్వహించడంతో అవార్డుల ప్రదానోత్సవానికి వచ్చిన పలువురు సామాజిక కార్యకర్తలు, సామాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవ్వడంతో వేడి భరించలేక ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది. ఆదివారం నవీ ముంబయి లో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది.

నీడ లేకుండా ...

అవార్డుల ప్రదానోత్సవానికి వచ్చిన వారికోసం సిట్టింగ్ ఏర్పాట్లు చేసినప్పటికీ.. నీడ లేకపోవడంతో ఎండ తీవ్రతను భరించలేక అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే రూ.5 లక్షల నష్టపరిహారం ప్రకటించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి అయ్యే ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు.

రాజ్యాంగ పరిరక్షణకు ముందుకురండి

- నాగ్‌పూర్‌లో ప్రతిపక్షాల మహార్యాలీ పిలుపు

నాగ్‌పూర్ : మహారాష్ట్రలో ప్రతిపక్షాల మధ్య ఐక్యత లేదనే వార్తలను తిప్పికొడుతూ నాగ్‌పూర్‌లో ఆదివారం మహా ర్యాలీ జరిగింది. మహా వికాస్ అఘాడికి కూటమిలోని శివసేన (ఉద్ధవ్ బాల్ థాక్రే), కాంగ్రెస్, ఎన్‌సిపి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో ఉద్ధవ్ థాక్రే మాట్లాడుతూ అధికార బిజెపి- శివసేన (షిండే) కూటమిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మహారాష్ట్ర వీరుల రాష్ట్రమని, వెన్ను పొడిచే నాయకులది కాదని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని నాశనం చేయడానికి బిజెపి ప్రయత్నం చేస్తోందని, ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని రక్షించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అదానీ విషయంపై బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు రాహుల్‌పై అనర్హత వేటు వేశారని, ఇప్పుడు కేజ్రీవాల్‌ను జైల్లో పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని థాక్రే విమర్శించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు నానా పటేల్, ఎన్‌సిపి రాష్ట్ర అధ్యక్షులు జయంత్ పాటిల్ కూడా పాల్గొన్నారు. ఈ ర్యాలీని అడ్డుకోవడానికి బిజెపి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేసిందని నానా పటేల్ విమర్శించారు. జయంత్ పాటిల్ మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించడానికి ఏక్‌నాథ్ షిండే భయపడుతుందని ఆరోపించారు. శివ సైనికులు అంతా ఉద్ధవ్ థాక్రే వెంటే ఉన్నారని చెప్పారు.

బీహార్‌లో రెండో దశ కుల గణన ప్రారంభం

పాట్నా : బీహార్‌లో రెండో దశ కుల జనగణన శనివారం ప్రారంభమైంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎక్కువ జనాభా ఉన్న రాష్ట్రాల్లో కులం ఆధారంగా జనాభాను లెక్కించడం ఇదే మొదటిసారి. ఇందులో మొదటి దశను జనవరి 7 నుంచి 21 వరకూ నిర్వహించారు. ఇందులో జిల్లాల ప్రకారం కుటుంబాలను లెక్కించారు. ప్రస్తుత రెండో దశలో ప్రజల సామాజిక ఆర్థిక సూచికలను, కుల స్థితులను నమోదు చేశారు. రెండో దశ సందర్భంగా పాట్నాలోని భక్తియార్‌పూర్‌లో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నుంచి ఎన్యుమరేటర్ సిబ్బంది సమాచారాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో నితీష్ కుమార్ మాట్లాడుతూ 'కుల జనగణన అనేది మంచి కసరత్తు. ఇది అన్ని కులాల సంఖ్య, వారి సామాజిక ఆర్థిక స్థితిగతుల గురించి సమాచారాన్ని ప్రభుత్వానికి అందిస్తుంది. ప్రభుత్వ కార్యక్రమాలను మరింత మెరుగ్గా రూపొందించడానికి సహాయపడుతుంది' అని చెప్పారు. ఈ జన గణన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన అనంతరం ప్రజలకు అందజేస్తామని తెలిపారు. ఇలాంటి ప్రక్రియను దేశమంతా అమలు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. రెండో దశ మే 15 వరకూ కొనసాగుతుంది. ఈ దశలో సుమారు 3,20,000 మంది సిబ్బంది దాదాపు 2.90 కోట్ల కుటుంబాల నుంచి వివరాలను సేకరిస్తారు.

కర్ణాటకలో బిజెపికి మరో షాక్

- కాంగ్రెస్‌లో చేరనున్న జగదీశ్ షెట్టర్
- ఎమ్మెల్యే పదవికి రాజీనామా



ఎమ్మెల్యే పదవికి రాజీనామా సమర్పిస్తున్న మాజీ సిఎం జగదీశ్ షెట్టర్

బెంగళూరు : కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ షెట్టర్ ఆదివారం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. బిజెపికి కూడా రాజీనామా చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. 'నేను అసెంబ్లీ సభ్యత్వానికి, పార్టీకి రాజీనామా చేస్తున్నాను. పార్టీ కోసం ఎంతో కష్టపడ్డాను. అయితే వాళ్లు ఇప్పుడు నేను బయటికి పోయేలా చేశారు' అని షెట్టర్ చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసేందుకు ఆయనకు బిజెపి నాయకత్వం టికెట్ నిరాకరించిన విషయం తెలిసిందే. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన షెట్టర్ హుబ్బళ్లి-ధార్వాడ్ సెంట్రల్ నియోజకవర్గం నుండి మరోసారి టికెట్ ఆశించారు. అయితే పార్టీ అధినాయకత్వం ఆయనకు మొండిచేయి చూపింది. షెట్టర్ కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది. షెట్టర్‌ను బుజ్జగించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రయత్నించారని, అయినా ప్రయోజనం లేకపోయిందని ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై తెలిపారు. ఢిల్లీలో పెద్ద పదవి ఇస్తామని షా హామీ ఇచ్చారని కూడా అన్నారు. బొమ్మైతో పాటు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ కూడా షెట్టర్‌కు నచ్చచెప్పేందుకు ప్రయ త్నించి నా ఫలితం లేకపోయింది. షెట్టర్ రాజీనామా బిజెపికి పెద్ద ఎదురు దెబ్బగా పరిశీలకులు భావిస్తున్నారు. ఉత్తర కర్ణాటకలో ఆయన కీలక నేతగా వ్యవహరిస్తున్నారు. ఇరవై నుంచి ఇరవై ఐదు నియోజకవర్గాలలో ఆయన ప్రభావం ఉంటుంది. మాజీ ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ్ సావడి కూడా బిజెపికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.



బహిరంగ సభలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

అదాని అవినీతికి చిహ్నం


- జైలుకు పంపినా మోడీని ప్రశ్నిస్తూనే ఉంటా
- కోలార్ ఎన్నికల ప్రచార సభలో రాహుల్



బెంగళూరు : దేశంలో గౌతమ్ అదానీ అవినీతికి చిహ్నమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. తన ఎంపి సభ్యత్వంపై అనర్హత వేటు వేసినా.. జైలుకు పంపినా అదానీతో ఉన్న సంబంధం గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ప్రశ్నిస్తూనే ఉంటానని రాహుల్ స్పష్టం చేశారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కోలార్‌లో 'జై భారత్ సత్యాగ్రహం' పేరుతో నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల బహిరంగ సభలో ఆదివారం రాహుల్ ప్రసంగించారు. 'వాళ్లు (బిజెపి) నన్ను పార్లమెంట్‌లో మాట్లాడనివ్వడం లేదు. అదానీ గురించి ప్రశ్నలు అడుగుతానని వారికి భయం. పార్లమెంట్ నుంచి పంపేస్తే భయపడతానని వాళ్లు అనుకున్నారు. కానీ నేను భయపడను. ప్రధానమంత్రిని ప్రశ్నిస్తూనే ఉంటాను' అని రాహుల్ చెప్పారు. తనకు సమాధానాలు లభించే వరకూ ఆగనని కూడా చెప్పారు. మే 10న ఎన్నికలు జరగనున్న కర్ణాటకలో రాహుల్‌కు ఇదే తొలి ప్రచార సభ. ఈ సభలో ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కెపిసిసి అధ్యక్షులు డికె శివకుమార్, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి రణదీప్ సుర్జేవాలే, కెసి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో భారీ అగ్నిప్రమాదం..

- నలుగురు భారతీయులుసహా 16 మంది మృతి



అల్‌రాస్ : దుబాయ్‌లోని ఓ ఐదంతస్తుల అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో నలుగురు భారతీయులుసహా 16 మంది సజీవ దహనమయ్యారు. మరో తొమ్మిదిమంది తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదం అల్ రాస్ నగరంలోని అల్ ఖలీజ్ స్ట్రీట్‌లో గల ఐదు అంతస్తుల భవనంలో సంభవించింది. నాలుగో అంతస్తులో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో శనివారం మధ్యాహ్నం 12.35 గంటలకు మంటలు ఎగసిపడగా.. దుబాయ్ సివిల్ డిఫెన్స్ బృందాలు మధ్యాహ్నం 2.42 గంటలకు మంటల్ని అదుపులోకి తీసుకొచ్చాయి. గాయపడిన వారిని ఆస్పత్రిలో చేర్పించి.. చికిత్స అందించినట్లు అక్కడి అధికారులు తెలిపారు.

చనిపోయిన వారిలో కేరళకు చెందిన దంపతులు, తమిళనాడుకు చెందిన మరో ఇద్దరు పురుషులు ఉన్నారు. రిజేష్ (38), ఆయన భార్య జిషి (32) మలప్పురం వెంగరకు చెందిన వారు కాగా.. అబ్దుల్ ఖాదర్, సలియాకుండ్ తమిళనాడు వాసులు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే ఈ ప్రమాదానికి దారితీసిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

మద్యం కేసు ఓ కల్పితం

(మొదటి పేజీ తరువాయి)

నేతలు ధర్నా చేశారు. కేజ్రీవాల్ విచారణ సందర్భంగా సిబిఐ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. భారీ స్థాయిలో పోలీస్ బలగాలు మోహరించాయి. కేజ్రీవాల్‌ను తమతోపాటు తీసుకెళ్లే వరకు సిబిఐ ప్రధాన కార్యాలయం నుంచి కదిలేది లేదని ఆప్ నేతలు స్పష్టం చేశారు.

కేజ్రీవాల్‌కు సిబిఐ సమన్లను వ్యతిరేకిస్తూ ఢిల్లీ వీధుల్లో ఆప్ కార్యకర్తలు ప్రదర్శనలు నిర్వహించారు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, మంత్రులుసహా దాదాపు 1,500 మంది ఆప్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని బస్సుల్లో వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఆప్ ఎంపి సంజయ్ సింగ్ మాట్లాడుతూ కేజ్రీవాల్ మంచి విద్య, వైద్య విధానాన్ని దేశానికి ఇచ్చినందుకు శిక్షిస్తున్నారని విమర్శించారు. ఆప్ ఎంపి రాఘవ్ చద్దా మాట్లాడుతూ, కేజ్రీవాల్‌ను జైలులో పెట్టి, ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేయడమే బిజెపి ఏకైక లక్ష్యమని మండిపడ్డారు. 32 మంది ఢిల్లీ ఎమ్మెల్యేలు, 70 మంది కౌన్సిలర్లు, ఢిల్లీ సరిహద్దుల్లో 20 మంది పంజాబ్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేసినట్లు ఆప్ తెలిపింది. కేజ్రీవాల్ సిబిఐ కార్యాలయానికెళ్లే ముందు తన నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఢిల్లీ రాష్ట్ర మంత్రులు అతిషి, కైలాశ్ గెహ్లాట్, రాజ్ కుమార్ ఆనంద్, గోపాల్ రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆ రాష్ట్ర శాసన సభ స్పీకర్ సర్దార్ కుల్తార్ సింగ్ సంధ్వాన్, ఆప్ ఎంపిలు రాఘవ్ చద్దా, ఎన్‌డి గుప్తా, ఢిల్లీ శాసన సభ స్పీకర్ రామ్ నివాస్ గోయల్ తదితరులు పాల్గొన్నారు.

సంబల్‌పూర్‌లో పథకం ప్రకారమే హింసాకాండ

- 79 మంది అరెస్టు : ఎస్‌పి
- బాధ్యులపై కఠిన చర్యలు : డిజిపి
- కొనసాగుతున్న కర్ఫ్యూ, ఇంటర్నెట్ నిషేధం



భువనేశ్వర్ : ఒడిషాలోని ప్రముఖ రాజకీయ, సాంస్కృతిక నగరమైన సంబల్‌పూర్‌లో పథకం ప్రకారమే హనుమాన్ జయంతి సందర్భంగా మతతత్వ మూకలు హింసాకాండకు పాల్పడ్డాయని సంబల్‌పూర్ ఎస్‌పి బి.గంగాధర్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకూ అందిన సమాచారం ప్రకారం ముందస్తు పథకం ప్రకారమే హింసాకాండకు పాల్పడ్డారని తెలిపారు. ఇందుకు కారకులైన వారిని మరింతమందిని అరెస్టు చేస్తామని చెప్పారు. ఈ నెల 12న బైక్ ర్యాలీ సందర్భంగా రాళ్ల దాడి, 14న ఊరేగింపు సందర్భంగా హింస, వాహన, దుకాణాలు, ఇళ్లకు నిప్పుపెట్టడం వంటి ఘటనలు జరిగాయన్నారు. తప్పుడు వార్తల వ్యాప్తిని అడ్డుకోవడానికి సోమవారం ఉదయం 10 గంటల వరకూ ఇంటర్నెట్‌ను ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. అల్లర్లకు సంబంధించి ఇప్పటివరకూ 79 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరిలో 26 మంది ఈ నెల 12న రాళ్ల దాడికి పాల్పడిన వారని, మరో 53 మంది ఈ నెల 14న గృహ, దుకాణ, వాహన దహనాలకు, అల్లర్లకు పాల్పడినవారని చెప్పారు. ఈ అల్లర్లలో ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడు. అల్లర్లతో అతనికి సంబంధం లేదని ఎస్‌పి చెప్పారు.

ఒకటి రెండు రోజుల్లో సాధారణ వాతావరణం : డిజిపి

హింసాకాండలో పాల్గొన్న, భాగస్వాములైన వారందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఒడిశా డిజిపి సునీల్ కె బన్సాల్ తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో సాధారణ పరిస్థితులు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కర్ఫ్యూ సందర్భంగా ఆయన పట్టణంలో పర్యటించారు. పోలీసులకు, ఇతర పాలనా అధికారులకు సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ఘర్షణలు చెలరేగిన నేపథ్యంలో శనివారం నుంచి అధికారులు కర్ఫ్యూ, ఇంటర్నెట్ నిషేధం విధించారు. నగరంలోని ప్రతి వీధిలోనూ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. సాధారణ అవసరాల కోసం ఆదివారం కొన్ని గంటల పాటు కర్ఫ్యూను సడలించారు.

12 నుంచే అల్లర్లు

సంబల్‌పూర్‌లో హనుమాన్ జయంతికి ముందు నుంచే అల్లర్లు ప్రారంభమయ్యాయి. ఈ నెల 12న హనుమాన్ జయంతి సమన్వయ సమితి నేతృత్వంలో జరిగిన బైక్ ర్యాలీ సందర్భంగానూ ఘర్షణలు జరిగాయి. పట్టణంలో అనేక ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. వివిధ వర్గాలతో చర్చల అనంతరం హనుమాన్ జయంతి నిర్వహించుకోవడానికి ప్రజలకు పోలీసులు అనుమతి ఇచ్చారు. మళ్లీ తీవ్ర స్థాయిలో అల్లర్లు జరిగాయి.

రాజకీయ లబ్ధి కోసం బిజెపి యత్నం : బిజెడి విమర్శ

సున్నితమైన పరిస్థితి నుంచి రాజకీయ లబ్ధి కోసం బిజెపి ప్రయత్నిస్తోందని బిజెడి ఎమ్మెల్యే రాజ్‌కిషోర్ విమర్శించారు. బిజెపికి ప్రతిదానిని మతతత్వ కోణంలో చూడటం అలవాటని అన్నారు. పరిస్థితిని అదుపు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రభుత్వం చట్టప్రకారం అన్ని చర్యలు తీసుకుందని బిజెడి నాయకుడు, ఎమ్మెల్యే అమర్ సత్పతి చెప్పారు.

CHANGE OF NAME

I **Pamguluri Ganapathy Rao S/o Subba Rao** R/o Flat no. F-1,Munnangi Towers,A.T. Agraharam, Guntur declares that due to typographic mistake in my passport my name was mentioned as **Panguluri Ganapathi Rao.** My original name is Pamguluri Ganapathy Rao S/o Subba rao hereafter my name is known as **Pamguluri Ganapathy Rao**

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VINUKONDA

O.S. 78/2020

Between:
Canara Bank, Main Branch, Guntur Rep. by its Manager ......**PLAINTIFF**
AND:
Anumolu Anji Reddy ....**Defendant**
To:
Anumolu Anji Reddy, S/o Rami Reddy, age 65 years, R/o 3-14-100 (c), 2nd Line, Old Pattabhipuram, Guntur City.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు సమన్లు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చిఉన్నారు. కావున పైన ఉదహరించిన ప్రతివాది **తేది 26-04-2023, ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

గాదె ఎరుకల రెడ్డి
వాది తరపు అడ్వకేటు, సెల్ నెం. 9848349516

IN THE COURT OF II ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT GUNTUR

O.S. 228/2022

Between:
Canara Bank, Main Branch, Guntur Rep. by its Manager......PLAINTIFF
AND:
M Sai Sandeep and Others ....**Defendants**
To:
1. **Manchikalapudi Sai Sandeep, age 27 years, s/o late M Srinivasa Rao.**
2. **Manchikalapudi Swarnalatha, age 47 years, W/o Late M Srinivasa Rao.**
3. **Manchikalapudi Jayadeep, age 24 years, S/o Late M Srinivasa Rao.**

1 to 3 residents of Door No 4-20-49, 4th line, Siddhardha Nagar, Near JKC College, Guntur City.

పై నెంబరు దావాలో ప్రతివాదులైన మీకు సమన్లు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చిఉన్నారు. కావున పైన ఉదహరించిన ప్రతివాదులు **తేది 27-04-2023, ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

గాదె ఎరుకల రెడ్డి
వాది తరపు అడ్వకేటు, సెల్ నెం. 9848349516



చిన్నారి



మీ కోసం

వంటింట్లో వాడే చిన్న కత్తెరకు పదును పోయినప్పుడు దాంతో అల్యూమినియం పేపరును కట్ చేస్తే పదును పెరుగుతుంది.

జీవన సౌరభం

పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా... అవసరమైన అవకాశాలను సృష్టించుకోవడం అభివృద్ధి లక్షణం.

JEEVANA జీవన the family

పూల మొక్క



పొద్దునే లేచాను
మొక్కొకటి నాటాను
రోజూ నీళ్ళు పోసాను
ఎరువులెన్నో వేసాను


పాదు చక్కగా చేసాను
కంటికి రెప్పలా చూసాను
మొక్క నాతోనే పెరిగింది
పూలెన్నో ఇచ్చింది

మా అమ్మ మెచ్చింది
అమ్మమ్మ నవ్వింది
నాన్న భళా అన్నాడు
తాతయ్య ముద్దిచ్చాడు

పూలన్నీ కోసాను
మాలలుగా కట్టాను
బడికి వడిగా వెళ్ళాను
నా నేస్తాలకు పంచాను

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
77802 77240

దారి చూపండి



చిన్నారులూ, ఇక్కడ ఉన్న కుక్క పిల్ల తన స్నేహితురాలైన పిల్లి పిల్లని కలుసుకోవాలి. మరి దారి చూపి సాయం చేయరూ!

నేను గీసిన బొమ్మ



సరళ ఇవాంజలిన్,
4వ తరగతి,
జూబిలీ మెమోరియల్ స్కూలు,
కొంతమూరు, రాజమండ్రి రూరల్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఇష్టమైన పనులు .. ఇచ్చును ఆనందం!

తీవ్ర ఎండ, వేడిగాలి వల్ల శరీరంలో కొన్ని రకాల హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి చికాకును కలిగిస్తూ మనసును స్థిమితంగా ఉంచవు. దాంతో చిన్న చిన్న పనులే భారంగా అనిపిస్తూ ఉంటాయి. ఇంట్లో కళ్ల ముందు బోలెడు పనులు కనిపిస్తున్నా చేసేందుకు శరీరం, మైండ్ సహకరించవు. బలవంతంగా ఆ పనులన్నీ చేస్తే తెలియకుండానే ఒత్తిడి పెరిగిపోతుందంటున్నారు వైద్య నిపుణులు. ఆ సమయంలో మనసుకు ఇష్టమైన పనులు మాత్రమే చేయాలంటున్నారు. దాంతో ఆత్మవిశ్వాసం పెరిగి ఒత్తిడి తగ్గుతుంది. తిరిగి మరుసటి రోజు శరీరం యాక్టివేట్ అవుతుందంటున్నారు వైద్యులు.

- ఇంటి బాధ్యతలు, ఉద్యోగం వల్ల చాలా రోజులుగా మాట్లాడని స్నేహితులతో ఫోన్ చేసి మాట్లాడండి. వారి వీలును బట్టి అందరూ ఓ చోట కలిసే ప్రయత్నం చేస్తే ఇంకా బాగుంటుంది. తమ జీవితంలో మార్పులను, కష్టసుఖాలను పంచుకుంటే మనసుకు కొంచెం ఊరటగా అనిపిస్తూ ఉంటుంది. స్కూలు, కాలేజీ రోజులనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని నవ్వుకోవచ్చు. రొటీన్ లైఫ్‌కి కొంచెం బ్రేక్ ఇచ్చినట్లూ ఉంటుంది.
- కొంతమందికి మొక్కలంటే ఇష్టం. కాని తీరక లేదని, పెంచేందుకు స్థలం లేదని వాటి మీద దృష్టి పెట్టరు. కాబట్టి ఆ రోజు నాలుగైదు కుండీలు తీసుకొచ్చి, ఇంట్లో చల్లదనాన్ని పెంచే మొక్కలు పెట్టండి. లేదా ఇంట్లో ఖాళీగా ఉన్న డబ్బాల్లో మనీప్లాంట్ లాంటి మొక్కలను అక్కడక్కడ పెట్టండి. ఇంట్లో అందంగా ఉంటుంది. మనసుకు ప్రశాంతంగానూ అనిపిస్తుంది.
- ఫోన్ జోలికి వెళ్లకుండా మీకు ఇష్టమైన మహనీయుల జీవిత చరిత్రలను, పిల్లల కథల పుస్తకాలను చదవండి. మిమ్మల్ని ఎంతగానో ప్రభావితం చేసిన వారి జీవిత



విశేషాలను తెలుసుకోండి. తర్వాత చదువుదాం అనుకుని పక్కన పెట్టిన పుస్తకాలు తీసి చదవండి. అప్పుడు కుంగుబాటుకు లోనుకాకుండా ఉంటారు. ఆ పుస్తకంలో నచ్చిన సంఘటనలు ఓ డైరీలో రాసుకోండి. తీరిక దొరికినప్పుడల్లా చదువుకునేందుకు ఉపయోగపడతాయి.

- పిల్లలు తినరని, జీవత భాగస్వామికి ఇష్టం లేదని చాలాకాలంగా మీకు నచ్చిన ఆహారం జోలికి వెళ్లరు. అందుకే ఆ రోజు వండుకుని తృప్తిగా తినండి. లేదా రెండు, మూడు గంటలు నచ్చిన పాటలు వినండి. సంగీతం మానసిక వైద్యానికి మంచి మందు. పాత పాటలు, మెలోడీ సాంగ్స్ వింటూ చిన్న చిన్న స్టెప్స్ వేయండి.
- ఉదయం గానీ, సాయంత్రం వేళలో మీకు సన్నిహితంగా ఉండే స్నేహితులతో సరదాగా బయటకు వెళ్లండి. లేదా జీవిత భాగస్వామితో కలిసి వాకింగ్ చేయండి. చెమట పడుతుందని, శారీరక శ్రమ అని బద్ధకించవద్దు. నడక కండరాల ఒత్తిడిని తగ్గిస్తుంది. మనసును ఉల్లాసంగా ఉంచుతుంది. నడుస్తూనే నచ్చిన అంశాలను షేర్ చేసుకోండి. మిమ్మల్ని ఎంతగానో ఉత్సాహపరిచిన సంఘటనలు చెప్పుకుని నవ్వుకోండి.
- చాలాకాలంగా సిగ్గు, భయంతో జీవిత భాగస్వామికి చెప్పాల్సిన కొన్ని విషయాలను చెప్పకుండా మనసులోనే ఉంచుకుంటూ ఒత్తిడికి లోనవుతూ ఉంటారు. ఆ విషయాలను ధైర్యంగా చెప్పమంటున్నారు నిపుణులు. అప్పుడే మనసు తేలికపడి ఒత్తిడి తగ్గుతుందంటున్నారు నిపుణులు. మనసు నొచ్చుకోకుండా సానుకూలంగా తీసుకోమని చెప్పండి. దాంతో గొడవలకు తావుండదు.
- చిన్ననాటి అల్లరి గుర్తు తెచ్చుకుని ఇంటి దగ్గర ఉన్న పిల్లలతో కలిసి క్రికెట్, టెన్నీస్, కబడ్డీ లాంటి ఆటలాడటండి. ఎంతో సరదాగా ఉంటుంది. వారికి మీకు తెలిసిన కథలు చెప్పండి. లేదా వారిని తీసుకుని పార్కుకు, సినిమాకు వెళ్లండి. పిల్లలితో స్నేహం ఒత్తిడి తగ్గిస్తుంది. రొటిన్ లైఫ్‌కి కొంచెం మార్పు దిశగా అడుగులు వేస్తే మంచిదంటున్నారు వైద్యులు.


పలుచని మజ్జిగతో పలు లాభాలు



వేసవిలో తరచూ చెమట రూపంలో శరీరంలో ఉన్న లవణాలన్నీ పోయి నీరసంగా అనిపిస్తూ ఉంటుంది. ఇలాంటప్పుడు కూల్ డ్రింక్స్ కంటే సహజ ఆహారం. వేసవిలో నిమ్మరసం, ఉప్పు కలిపి పలుచగా మజ్జిగ ప్రతిరోజూ తీసుకుంటే వడదెబ్బ తగలదంటున్నారు.

- ఎండలో బయటకు వెళ్లినవారు చల్లగా ఈ మజ్జిగను తాగడం వల్ల శరీరం చల్లబడుతుంది. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. శరీరంలో ద్రవాలు సమతూకంలో ఉంటాయి.
- మజ్జిగలో ఉండే బయోయాక్టివ్ సమ్మేళనాలు కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రిస్తాయి. చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దాంతో గుండె దడ, ఆయాసం ఉండదు.
- కాల్షియం లోపం ఉన్నవారు మజ్జిగను తీసుకోవడం వల్ల శరీరానికి కాల్షియం అందుతుంది. తద్వారా ఎముకలు, దంతాలు దృఢంగా మారుతాయి.
- మజ్జిగను తాగడం వల్ల రక్త సరఫరా మెరుగు పడుతుంది. జీర్ణ సమస్యలు పోతాయి. ముఖ్యంగా గ్యాస్, అసిడిటీ తగ్గుతాయి. అలాగే చర్మం కాంతివంతంగా మారుతుంది.
- మజ్జిగ అన్నంలో మామిడి పండ్లను లేదా అరటి పండును కలిపి తినడం వల్ల విటమిన్ ఏ, డి శరీరానికి అధిక మోతాదులో అందుతాయి.
- పలచని మజ్జిగలో కొత్తిమీర లేదా పుదీనా, ఉప్పు కలిపి తాగితే బిపి, షుగరు వ్యాధులు నియంత్రించవచ్చు.

బొబ్బర్లతో మధుమేహం అదుపు



బొబ్బర్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. బొబ్బర్లలో కొవ్వులు, క్యాలరీలు తక్కువగా ఉండటంతోపాటు పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. షుగరు, అధికబరువు లాంటి సమస్యలతో బాధపడుతున్న వారికి మంచి పరిష్కారం చూపుతాయి.

- బొబ్బర్లలో క్యాలరీలతోపాటు కొవ్వులు కూడా తక్కువగా ఉండటంవల్ల బరువు తగ్గడానికి తోడ్పడుతాయి. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఈ ఫైబర్ అధిక బరువును తగ్గించడంలో ప్రధానపాత్ర పోషిస్తుంది.
- మధుమేహులకు లో-గ్లిజమిక్ ఇండెక్స్ కలిగిన బొబ్బర్లు చాలా ఆరోగ్యకరం. ఇవి బ్లడ్ షుగర్ స్థాయిలను అదుపులో ఉంచడంలో సహాయపడుతాయి.
- బొబ్బర్లలో యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్ పుష్కలంగా ఉంటాయి. అందుకే వీటిని ఆహారంగా తీసుకోవడంవల్ల పోషకాహార లోపంతో వచ్చే కొన్నిరకాల వ్యాధులు ధరిచేరవు. ఇవి శరీరంలో వైరస్ వ్యాప్తి చెందకుండా హానికర టాక్సిన్స్‌ను నివారిస్తాయి.
- బొబ్బర్లు రక్తంలో కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. వీటిలో ఉన్న ఫ్లెవనాయిడ్స్, మినిరల్స్, పొటాషియం, మెగ్నీషియం గుండె ఆరోగ్యానికి మంచివి.
- వీటిలో ఉన్న ఫైబర్ కంటెంట్ జీర్ణ సంబంధిత సమస్యలను నివారిస్తుంది. అధిక ప్రొటీన్ కంటెంట్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మ రంధ్రాలు తెరుచుకొనేలా చేస్తుంది. వాటిలోని యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ ఎ, సి చర్మ కణాలను రక్షిస్తాయి.

స్టైల్ మారింది,, రూటు మార్చారు,,

నటన.. భావోద్వేగ ఊహ.. ఏడుపు, నవ్వు ఒకేసారి రావాలన్నా.. ఒక కంటితో నవ్వాలి.. ఇంకో కంటితో ఏడ్వాలన్నా.. స్వరం పెంచి ఒకసారి.. తగ్గించి మరోసారి డైలాగ్ చెప్పాలన్నా.. ఇలా పాత్ర డిమాండ్‌ను బట్టి నటీనటులు ఆయా పాత్రల్లో ఒదిగిపోతుంటారు. కానీ కొంతమంది నటులు మాత్రం ఏ పాత్రతో పరిచయం అవుతారో.. ఆ పాత్రతోనే చాలా సినిమాల్లో కనిపిస్తుంటారు. ఫలానా పాత్రలకు ఫలానా నటులే సరిపోతారని ప్రేక్షకులు కూడా సిద్ధమైపోతారు. ముఖ్యంగా కామెడీ పాత్రల్లో నటించే నటీనటులు ఏళ్లకు ఏళ్లు ఆయా పాత్రల్లోనే అలరిస్తుంటారు. అయితే ఈ మధ్యకాలంలో కమెడియన్లు రూటు మార్చారు. కామెడీ పాత్రలే కాక.. విలన్లుగా, హీరోలుగా, సైకోలుగా, సీరియస్ పాత్రల్లో అలవోకగా నటించేస్తూ ప్రేక్షకుల మెప్పు పొందుతున్నారు.

సునీల్.. ఇండస్ట్రీలో డ్యాన్సర్‌గా రాణించాలని వచ్చిన సునీల్ దశాబ్దకాలం పాటు కమెడియన్ పాత్రలకే పరిమితమయ్యారు. ఆ తరువాత రూటు మార్చి హీరోగా పరిచయమైనా పెద్దగా సక్సెస్ అందుకోలేదు. క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా లాభం లేకపోయేసరికి మళ్లీ కమెడియన్‌గా నటించడానికి సిద్ధమైన తరుణంలో 'పుష్ప' సినిమా సునీల్ కెరియర్‌ను మలుపు తిప్పింది. మంగళం శ్రీనుగా సుకుమార్ ఇచ్చిన విలన్ అవకాశం సునీల్‌ని కొత్తగా చూపించింది. ఈ విలక్షణ నటనకు ప్రేక్షకులు కూడా నీరాజనాలు పట్టారు. ఆ ఆదరణే ఇప్పుడు తమిళ సినిమాలో రజినీకాంత్‌కు ప్రతినాయకుడిగా నటించే స్థాయికి తీసుకొచ్చింది.


కోవై సరళ.. క్యారెక్టర్ ఆర్టిస్టుగా కొన్నేళ్లు అలరించిన కోవై సరళ.. ఆ తరువాత కమెడియన్ పాత్రల్లో ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. లేడీ కమెడియన్‌గా తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. అయితే ఈ మధ్య కాలంలో తమిళంలో వచ్చిన సెంబి సినిమాలో ఓ విలక్షణ పాత్రలో కనిపించి ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేశారు. ఓ బాలికకు అమ్మమ్మ పాత్రలో ఆమె ఒదిగిపోయిన తీరు.. మనుమరాలికి జరిగిన అన్యాయంపై ఆమె పోరాడిన తెగువ ప్రేక్షకులకు కంటనీరు తెప్పించింది.

బ్రహ్మానందం.. కామెడీ అంటే బ్రహ్మానందం.. బ్రహ్మానందం అంటే కామెడీ అనే స్థాయిలో బ్రహ్మానందం అనేక కామెడీ పాత్రలు చేశారు. డైలాగులు లేకుండా రకరకాల హావాభావాలతోనే ప్రేక్షకులను నవ్వించగల నటుడిగా పేరుపొందాడు. అటువంటి వ్యక్తి తాజాగా 'రంగమార్తాండ' సినిమాలో వృద్ధ రంగస్థల నటుడిగా చక్రి పాత్రలో నటించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. గతంలో బాబాయ్ హోటల్ లాంటి హీరో కమ్ సీరియస్ పాత్రల్లో నటించినా ఈ పాత్రలో మాత్రం ఆయనలో ఓ ప్రత్యేక నటుడ్ని చూస్తాం. సీనియర్ కమెడియన్లే కాదు.. యువ కమెడియన్లు కూడా అవకాశం వచ్చినప్పుడల్లా ఆయా పాత్రల్లో ఒదిగిపోయి నటిస్తూ.. ప్రేక్షకులను అలరిస్తున్నారు.

కమెడియన్‌గా ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రియదర్శి హీరోగా 'మల్లేశం' సినిమాలో విలక్షణ నటన కనబరిచారు. ఇప్పుడు 'బలగం' సినిమాలో మరో మంచి పాత్రలో కనిపించారు. సత్యం సినిమాతో హీరో ఫ్రెండ్ క్యారెక్టర్ కమ్ కమెడియన్‌గా ఇండస్ట్రీకి పరిచయమైన రాజేష్ కమెడియన్‌గా నటిస్తూనే.. హీరోగా వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వెబ్‌సిరీస్‌ల్లోనూ విలక్షణ నటనతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇక 'కలర్ ఫొటో' సినిమాతో హీరోగా పరిచయమైన సుహాస్ ఒక పక్క హీరోగా, కమెడియన్‌గా, సైకోగా, విలన్‌గా తనలోని నట విశ్వరూపాన్ని చూపిస్తున్నారు.

నటనే కాదు.. తమలో దాగున్న దర్శకత్వ ప్రతిభను కూడా బయటికి తీస్తున్నారు కొంతమంది కమెడియన్లు.. చిన్న సినిమాగా వచ్చి పెద్ద విజయం అందుకున్న 'బలగం' సినిమా దర్శకుడు వేణును అందరూ జబర్దస్త్ వేణుగా గుర్తుపెట్టుకుంటారు. సినిమాల్లో కమెడియన్‌గా కనిపిస్తూనే ఇండస్ట్రీకి ఇంత పెద్ద విజయాన్ని అందించిన సినిమాను తెరకెక్కించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. తాజాగా మరో జబర్దస్త్ కమెడియన్ శాంతి కుమార్ కూడా సాయికుమార్ వంటి సీనియర్ నటులతో 'నాతో నేను' సినిమా తెరకెక్కించి ఆ జాబితాలో చేరారు.

టాలెంట్ ఎవరి సొత్తు కాదు.. టాలెంట్ ఉంటే ఎప్పుడైనా ఎక్కడైనా రాణించొచ్చు అని ఈ నటీనటులు మరోసారి రుజువుచేశారు. వీరి బాటలో మరింతమంది నటీనటులు ఈ దారిలో నడవాలని మనసారా కోరుకుందాం.



బ్రహ్మానందం



సునీల్



ప్రియదర్శి



సుహాస్



శాంతికుమార్



సత్యం రాజేష్



కోవై సరళ



వేణు

ముంబయి మురిసింది

- ఛేదనలో సూర్యకుమార్, ఇషాన్ మెరుపులు
- వెంకటేశ్ అయ్యర్ శతక విధ్వంసం వృథా
- కోల్‌కతపై ముంబయి ఇండియన్స్ గెలుపు

బాధ్యతలు కొందరికి భారంగా అనిపిస్తే, ఆ బాధ్యతలే కొందరిలో ఉత్తమ ప్రదర్శన బయటకుతీస్తాయి. సూర్యకుమార్ యాదవ్ (43) విషయంలో ఇదే రుజువైంది. కెరీర్ తీవ్ర వైఫల్యంలో ఉన్న సూర్యకుమార్ యాదవ్ తొలిసారి కెప్టెన్‌గా అదరగొట్టాడు. సారథ్య బాధ్యతలు సూర్యలో పాత విధ్వంసకుడిని బయటపెట్టాయి!. ఇషాన్ కిషన్ (58) సైతం అర్ధ సెంచరీతో మెరవటంతో కోల్‌కత నైట్‌రైడర్స్‌పై ముంబయి ఇండియన్స్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. కోల్‌కత బ్యాటర్ వెంకటేశ్ అయ్యర్ (104) శతక విధ్వంసం వృథా అయ్యింది.

ముంబయి : ముంబయి ఇండియన్స్ మరో విజయం సాధించింది. జోరుమీదున్న కోల్‌కత నైట్‌రైడర్స్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. 186 పరుగుల ఛేదనలో ఓపెనర్ ఇషాన్ కిషన్ (58, 25 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), తాత్కాలిక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (43, 25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ వర్మ (30, 25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) కదం తొక్కారు. 17.4 ఓవర్లలోనే ముంబయి ఇండియన్స్ లాంఛనం ముగించి సీజన్లో రెండో విజయం నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కత నైట్‌రైడర్స్ 20 ఓవర్లలో 185/6 పరుగులు చేసింది. ఇంపాక్ట్ ఆటగాడు వెంకటేశ్ అయ్యర్ (104, 51 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్స్‌లు) శతక విధ్వంసంతో చెలరేగాడు. ముంబయి బౌలర్ల దెబ్బకు కోల్‌కత బ్యాటర్లు చేతులెత్తేసినా.. వెంకటేశ్ అయ్యర్ వన్ మ్యాన్ షోతో కోల్‌కత నైట్‌రైడర్స్‌కు మంచి స్కోరు అందించాడు.



వెంకటేశ్ అయ్యర్ (104)

మెరిసిన సూర్య, కిషన్ : 186 పరుగుల ఛేదనలో ముంబయికి మెరుపు ఆరంభం దక్కింది. రోహిత్ శర్మ (20), ఇషాన్ కిషన్ (58) పవర్‌ప్లేలో ధనాధన్ జోరు చూపించారు. ఓపెనర్ల మెరుపులతో ఆరు ఓవర్లలోనే ముంబయి 72 పరుగులు పిండుకుని, ఈ సీజన్లోనే పవర్‌ప్లేలో ఉత్తమ ప్రదర్శన చేసింది. ఇషాన్ కిషన్ ఐదు ఫోర్లు, ఐదు సిక్సర్లతోనే 50 పరుగులు పూర్తి చేశాడు. తాత్కాలిక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (43) ఫామ్‌లోకి వచ్చాడు. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో మెప్పించాడు. తెలుగు తేజం తిలక్ వర్మ (30, 25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన సూర్య.. ముంబయి ఇండియన్స్ విజయాన్ని లాంఛనం చేశాడు. చివర్లో సూర్య, తిలక్ నిష్క్రమించినా.. టిమ్ డెవిడ్ (24 నాటౌట్, 13 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) మరో 14 బంతులు మిగిలిఉండగానే ముంబయికి విజయాన్ని అందించాడు. కోల్‌కత బౌలర్లలో సుయాశ్ శర్మ (2/27) రాణించాడు.

అయ్యర్ అదుర్స్ : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన కోల్‌కత నైట్‌రైడర్స్‌కు మంచి ఆరంభం లభించలేదు. ఓపెనర్ ఎన్.జగదీశన్ (0) డకౌట్‌గా నిష్క్రమించాడు. మరో ఓపెనర్ రెహ్మానుల్లా గుర్బాజ్ (8) క్రీజులో నిలిచినా.. పరుగుల వేటలో నిరాశపరిచాడు. వెంకటేశ్ అయ్యర్ (104) వన్ మ్యాన్ షోతో కోల్‌కత ఇన్నింగ్స్‌ను నడిపించాడు. పవర్‌ప్లే అనంతరం కోల్‌కత 57/2తో నిలువగా.. అందులో సింహభాగం పరుగులు వెంకటేశ్ అయ్యర్ సాధించినవే!. ఓ వైపు సహచర బ్యాటర్లు ముంబయి బౌలర్లకు దాసోహం అవుతుండగా.. మరో ఎండ్‌లో వెంకటేశ్ అయ్యర్ భిన్నమైన



సూర్యకుమార్ యాదవ్ (43)

ప్రదర్శన చేశాడు. ముంబయి బౌలర్లపై పంజా విసిరిన అయ్యర్ నాలుగు సిక్సర్లు, ఐదు ఫోర్లతో 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. వెంకటేశ్ అయ్యర్ దూకుడుతో కోల్‌కత నైట్‌రైడర్స్ భారీ స్కోరు దిశగా సాగుతున్నప్పటికీ.. ఇతర బ్యాటర్ల నుంచి సహకారం కొరవడింది. కెప్టెన్ నితీశ్ రానా (5), శార్దుల్ ఠాకూర్ (13), రింకూ సింగ్ (18) నిరాశపరిచారు. ఒంటరి పోరాటం చేసిన వెంకటేశ్ అయ్యర్ ఐదు ఫోర్లు, తొమ్మిది సిక్సర్లతో 49 బంతుల్లోనే శతకం సాధించాడు. ఈ సీజన్ ఆరంభం నుంచీ గొప్ప ఫామ్‌లో ఉన్న వెంకటేశ్ అయ్యర్ ఐపీఎల్ కెరీర్‌లో తొలి వంద పరుగుల ఇన్నింగ్స్‌ను నమోదు చేశాడు. మూడంకెల స్కోరు అందుకోగానే వెంకటేశ్ అయ్యర్ నిష్క్రమించాడు. చివర్లో ఆండ్రీ రసెల్ (21 నాటౌట్, 11 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగైన ముగింపు అందించాడు. ముంబయి ఇండియన్స్ బౌలర్లలో హృతిక్ షోకిన్ (2/34) రెండు వికెట్లతో మెరువగా.. డ్యూన్ జాన్సెన్ (1/53) ధారాళంగా పరుగులు సమర్పించాడు. 20 ఓవర్లలో 6 వికెట్లకు కోల్‌కత నైట్‌రైడర్స్ 185 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ 203.92 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు చేయగా.. మిగతా కోల్‌కత నైట్‌రైడర్స్ బ్యాటర్లు అందరూ కలిసి 97 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు సాధించారు.

అమ్మాయిల జెర్సీతో..

ముంబయి ఇండియన్స్ ఆటగాళ్లు కోల్‌కత నైట్‌రైడర్స్‌తో మ్యాచ్‌కు ముంబయి ఇండియన్స్ మహిళల జట్టు జెర్సీతో బరిలోకి దిగారు. ముంబయి ఇండియన్స్ యాజమాన్యం రిలయన్స్ ఫౌండేషన్ బాలికల విద్య కోసం కృషి చేస్తున్న నేపథ్యంలో ఆదివారం నాటి మ్యాచ్‌కు మెన్స్ జట్టు అమ్మాయిల జెర్సీ ధరించింది. వివిధ ఎన్‌జీవోల ద్వారా సుమారు 19,000 మంది బాలికలు ముంబయి ఇండియన్స్, కోల్‌కత నైట్‌రైడర్స్ మ్యాచ్‌కు హాజరయ్యారు. దీంతో కోల్‌కతతో మ్యాచ్‌కు సాధారణ అభిమానులకు ఎటువంటి టిక్కెట్లు అందుబాటులో ఉంచలేదు. పూర్తిగా అమ్మాయిలతో వాంఖడే మైదానం నిండిపోయింది. 2023 డబ్ల్యూపీఎల్ విజేత, ముంబయి ఇండియన్స్ మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తోడుగా ముంబయి ఇండియన్స్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టాస్‌కు వచ్చారు.

అధ్యక్ష పదవికి పోటీ చేయను!

- జాతీయ స్పోర్ట్స్ కోడ్‌ను గౌరవిస్తాను : శరణ్ సింగ్



గోండా (ఉత్తరప్రదేశ్) : లైంగిక వేధింపులు, నిధుల దుర్వినియోగం, హత్యాయత్న బెదిరింపుల ఆరోపణలతో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్ష పదవికి దూరంగా ఉన్న బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్.. రాబోయే ఫెడరేషన్ ఎన్నికల్లో పోటీ చేయనని వెల్లడించారు. ఎంసీ మేరీకోమ్ సారథ్యంలోని డబ్ల్యూఎఫ్ఐ పర్యవేక్షణ కమిటీ ఇటీవల విచారణ నివేదికను కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖకు అందజేయగా.. నివేదికలోని అంశాలను మంత్రిత్వ శాఖ కార్యాలయం బయటకు వెల్లడించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తాను మళ్లీ అధ్యక్ష పదవికి పోటీ చేయనని శరణ్ సింగ్ ప్రకటించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68